ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
సోమవారం 29, ఆగస్టు 2022 16 పేజీలు

## భద్రాద్రి డివిజన్‌లో సుమారు 10వేల మందికి కొత్తపెన్షన్‌లు మంజూరు



**భద్రాచలం, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబంలో ఆనందం చూడాలని ముఖ్యమంత్రి కేసిఆర్ వజ్రోత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మందికి కొత్తపెన్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

2 లో...

## '999' భూ సమస్యకు
# పరిష్కారం లేదా..



- తరాలు మారినా తలరాత మారని గిరిజనులు...
- తాతల కాలం నుంచి సాగు చేస్తున్నా... పట్టాలు ఉన్నా నో ఛాన్స్...
- కాసులకు కక్కుర్తి పడి ముందుకురాని అధికార యంత్రాంగం...
- జిల్లాబాస్ ఆదేశించినా కదలని రెవెన్యూ అధికారులు
- గిరిజనుల వినతులు బుట్టదాఖలు చేస్తున్న వైనం...
- పదిపదిహేను ఏళ్లుగా బంగారుజాలలో భూమికోసం పోరాటం
- అయ్యా కేసీఆర్ గారు మా గోడు ఆలకించండి : బాధితురాలు ఎల్లమ్మ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రభాతవార్త :** అప్పుడు... ఇప్పుడు.. ఎప్పుడైనా సరే హాట్ టాపిక్ ఏంటయ్యా అని అడిగితే ఎవరైనా 'సర్వే నంబర్ 999' భూ సమస్య అని చెప్తున్నారు... ఎందుకంటే బంగారుజాల భూ సమస్య గురించి తెలియని వారు లేరనే చెప్పాలి... తమ తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న అసైన్డ్ భూమికి రెవెన్యూ శాఖ తరపున పట్టాలుకూడా ఇచ్చారు. అయితే తమ తాతముత్తాతలు వయస్సుపైబడి చనిపోయారు. వారి వారసత్వంగా వచ్చిన ఈ భూమిని ప్రస్తుతం ఉన్న వారి కుటుంబీకులు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఒక ఏడాది వరదలు రావడంతో ఊరంతా మునిగిపోయింది. ఆ సంవత్సరంలో వ్యవసాయం చేయడానికి ఎవరి వద్ద ఎలాంటి అనుకూలత లేదు. దీంతో ఒక ఏడాది వ్యవసాయం చేయలేదు. ఆ సమయంలోనే పాల్వంచకు చెందిన ఓ వ్యక్తి ఈ భూమిపై కన్నేశాడు.

2 లో...



# దస్త్రం సిద్ధం

- నెలరోజుల ఉత్కంఠకు తెర
- శేషాద్రికమిటీ నివేదిక
- సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం
- సెప్టెంబర్‌లో క్రమబద్ధీకరణ
- రెవెన్యూ సహాయకులకు తీపి కబురు

రఘునాథపాలెం, ప్రభాతవార్త : రెవిన్యూ వ్యవస్థలో కీలకంగా విధులు నిర్వహిస్తున్న (వి.ఆర్.ఏ) వారి పోరాటం ఎట్టకేలకు ఫలించింది. గత నెలరోజులు పైచిలుకు విధులు బహిష్కరించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తంచేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రోడ్డున పడ్డారు. రెవెన్యూ వ్యవస్థ ఏర్పడక ముందునుండి బ్రిటీష్‌కాలం నుండి గ్రామాల్లో పనిచేస్తున్న షేక్‌సింధీలుగానే పిలువబడే విఆర్‌ఏలను గత ఏడాది అసెంబ్లీలో ముఖ్యమంత్రి క్రమబద్ధీకరిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆనాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నెలరోజులుగా ఈ చిరుద్యోగులు వీధినపడ్డారు. ప్రతి గ్రామంలో ఏ సమస్య వచ్చినా ముందుగా సమాచారాన్ని అందించే వీరి పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరు, చాలీచాలని జీతాలతో పాటు వెట్టిచాకిరీ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చేసిన పోరాటాలకు ఎట్టకేలకు న్యాయం జరిగింది.

2 లో...

## మధ్యాహ్నభోజనానికి సమ్మె సెగ.?

- కోట్ల రూపాయల్లో బకాయిలు
- చేతులెత్తేస్తున్న నిర్వాహకులు!!

12 లో...

## అంతా.. ఓపెన్‌గా..

**పాల్వంచ డిగ్రీ కాలేజీలో గోల్‌మాల్**

- రెగ్యులర్, ఓపెన్ డిగ్రీ పరీక్షలకు ఫుల్ సపోర్ట్
- పరీక్షకో రేటు... ఇస్తే పాస్ గ్యారెంటీ...
- స్లిప్పులు అందిస్తూ అభ్యర్థులకు మరింత సహకారం
- డిబార్ అయిన వ్యక్తితో పరీక్ష రాయించిన ప్రిన్సిపాల్.?
- ఏం.. పర్వాలేదులే అంటున్న ప్రధానాచార్యులు.?



పాల్వంచ, ప్రభాతవార్త : 'రేయ్... నీకు ఏ కాలేజ్‌లో సెంటర్ పడిందిరా... నాకైతే ప్రైవేట్ కాలేజ్‌రా బాబు... అక్కడ చాలా స్ట్రిక్ట్‌గా ఉంటుందంటా... అవున్రా... నేను సేఫ్.. ఎందుకంటే నాకు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ సెంటర్ పడిందిరా... అక్కడ అలాంటివి ఏమీ ఉండవు... మనం డబ్బులిస్తే చాలు... మన పేపర్ మొత్తం నింపేలా వాళ్లే చూసుకుంటారు... ఇంట్లో రాత్రంతా మేల్కొని చదవాల్సిన అవసరం అసలే లేదు... ఒక్కో పరీక్షకు ఒక్కో రేట్ చెప్తారు.. మనం బేరం కుదుర్చుకొని డబ్బులు ఇచ్చేస్తే చాలు... మన టేబుల్‌పైకి జవాబులు వచ్చేస్తాయి.. ఎంచక్కా రాసుకోవచ్చు... అందుకే నేను సేఫ్ అని చెప్తున్నా.." ఈ సంభాషణ ఇద్దరు మిత్రుల మధ్య జరిగింది.. ఇప్పుడు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇదే జరుగుతోంది.

6 లో...



# ‘999’ భూ సమస్యకు పరిష్కారం లేదా...

మొదటి పేజీ తరువాయి

కబ్జా చేయాలనే ఉద్దేశంతో తప్పుడు రికార్డులతో రెవెన్యూ రికార్డుల్లో పేరు ఎక్కించకున్నాడు. అసలు రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉందో లేదో తెలియని వ్యక్తి దగ్గర నుంచి ఈ భూమిని కొన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. ఈ భూమి తమదేనని వెళ్లిన గిరిజనులను నెట్టేశారు. నిరక్షరాస్యులైన వారిని రెవెన్యూ, పోలీసులతో బెదిరించి కేసులు పెడతామని చెప్పి వారిని తరిమేశారు. ఈ భూమిలో తాము బొబ్బర్లు, కందులు ఇలా అన్ని రకాల పంటలు సాగు చేసుకొని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఎప్పటినుంచే ఈ భూమిని సాగు చేస్తున్నామని చెప్పినా వారు వినిపించుకోలేదు. రాత్రికి రాత్రే సదరు వ్యక్తి ఈ భూమిలో జామాయిల్ ప్లాంటేషన్ వేశాడు. ఈ భూమి తమదేనని అప్పటి నుంచి ఇప్పటి వరకు తహసీల్దార్ కార్యాలయంలో, కలెక్టరేట్‌లో కూడా ధరఖాస్తులు ఇస్తూనే ఉన్నారు. ఇచ్చిన ధరఖాస్తులను ఎంఆర్‌వో కార్యాలయంలో బుట్టదాఖలు చేస్తున్నారే కానీ వారి సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. సుమారు 30 ఎకరాలు భూమి ఉంది. 20 ఎకరాలకు మాత్రమే పట్టా వచ్చింది. ఇంకా 10 ఎకరాలకు పట్టా రావాల్సి ఉంది. అయితే అమాయక గిరిజనులను అలుసుగా తీసుకున్న సదరు కబ్జాదారుడు దర్జాగా ఆ భూమిలో పంట వేసుకొని లాభాలు గడిస్తున్నాడు.

బంగారుజాల ప్రాంతానికి చెందిన బాధితురాలు... ఓ ఎనభైఏళ్ల వృద్ధురాలు ఎల్లమ్మ తన ఆవేదనను ‘వార్త’ ప్రతినిధితో వెళ్లగక్కారు... అయ్యా కేసీఆర్ సార్ మీరే కదా ఇది మా భూమి అంటూ పట్టా బుక్కు ఇచ్చింద్రు... ఈ సార్లే కదా మా భూమిని చూసి సర్వే చేసి కాగితాల్లో ఎక్కించారు... ఎంఆర్‌వో సారే కదా మాకు పట్టా బుక్కులొచ్చినయ్ అని మా చేతికిచ్చిండు... అయితే మా భూమి అని బుక్కులు వచ్చినంకా... గిప్పుడు అది మా భూమి కాదని ఎవడో వచ్చి సెప్తే... మీరెలా నమ్ముతున్నారు... మీ సంతకం లేకుండా మాకు పట్టా బుక్కులైతే రాలేదుగా... అలాంటప్పుడు మాకు బుక్కులెందుకిచ్చారయ్యా... అప్పుడు సెప్పొచ్చుగా... అవ్వ... ఇది నీ భూమి కాదు... నీకు పట్టా రాదు అని... నాకు పట్టా వచ్చింది... రైతుబందు డబ్బులు కూడా నా బ్యాంకు ఖాతాలో పడుతున్నాయి... అయినా ఇప్పుడు నా భూమి కాదంటే నేనేడికి పోవాలే... ఏం చేయాలో కూడా తోచడం లేదు. గీ వయస్సులో భూమికోసం పోరాటం చేసే ఓపికైతే నాకు లేదయ్యా బాబు... బుక్కులిచ్చినప్పుడు మీరేమైనా కళ్లు మూసుకున్నారా... అన్ని చూసినంకనే ఇచ్చారుగా... అయితే ఈ భూమి వేరే వాళ్లదైతే... పట్టాలో ఉన్న మా భూమి ఎక్కడుంది... మా భూమిని మాకూ చూపించండి సారూ... మేం ఈ భూమిని ఎవరికీ అమ్మలే... కొనలే... అలాంటప్పుడు మా భూమికేమైనా రెక్కలొచ్చి ఎగిరిపోయిందా... అంతా మీకే తెలుసని అనుకోకండి సారూ... మేం పేదోళ్లమని... ఎలా చెప్తే అలా పడుంటారని అనుకుంటున్నారా... ఇప్పటి నుంచికాదు నేను... ఎప్పటి నుంచో ఈ భూమి కోసం తిరుగుతున్నా నాయనా... తిరగంగా తిరగంగా ఈ వయస్సుకు వచ్చాను.. అయ్యా మీరేం చేస్తారో ఏమో... నేను ముసలిదాన్ని అయిపోయా... నా భూమి నాకొచ్చేలా న్యాయం చేయండి అయ్యా... నా ఆయన ముసలయ్య కూడా లేడు. ఈ వయస్సులో భూమి కోసం తిరగలేకపోతున్నా... కాటికి పోయేంత వరకైనా నాకు న్యాయం చేయడం లేదు... నేను ఇంకేం చేయాలి... ఇంకెంత కాలం ఎదురుచూడాలి... ఈ వయస్సులో నన్ను తిప్పించుకోవడం ఏం బాగోలేదు...” పానం ఇడిసేలోగా భూమిని ఇప్పిస్తారా అంటూ సర్వే నంబర్ 999 బాధితురాలైన ఎర్రబోయిన ఎల్లమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది... అధికారుల తీరును తీవ్రంగా ప్రశ్నించింది.

**– ‘999’ భూ సమస్యకు పరిష్కారం లేదా...**

ఎవరైనా తమ సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో అర్జీ పెట్టుకుంటే వెంటనే పరిష్కారం చేసే అధికారులు... ఎన్నో సార్లు ధరఖాస్తులు చేసుకున్నా గిరిజనుల భూముల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు... అసలు 999 సర్వే నంబర్ భూ సమస్య పరిష్కారం అవుతుందా... నిజమైన వారికి ఈ భూమి చెందుతుందా... తమ జీవనాధారమైన భూమిని లాక్కున్న ప్రబుద్దిడిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.? అధికారులు కూడా ఇందులో సూత్రధారులా.? అయినా పదిహేనేళ్లుగా పోరాటం చేస్తున్న వారి గోస ఆలకించడం లేదు ఎందుకు..? అసలు ఈ సమస్యను చూసీ చూడనట్లుగా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు..? గతంలో అధికారులు సర్వేకు వచ్చి మళ్లీ ఎందుకు వెనక్కి వెళ్లిపోయారు.? జిల్లా కలెక్టర్ ఆదేశించినా అధికారుల్లో ఎందుకు చలనం లేకుండా పోయింది..? ఇలా అన్ని రకాల ప్రశ్నలను పట్టణ, మండల ప్రజలు సంధిస్తున్నారు. అయితే అధికార పార్టీకి చెందిన నాయకుడు ఈ కబ్జాలకు పాల్పడటంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారా.? లేక భారీగా ముడుపులు తీసుకోవడం వల్ల వారు తూతూ మంత్రంగా విచారణ చేస్తున్నట్లు యాక్టింగ్ చేస్తున్నారా... ? అనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

**– అసైన్డ్ భూమిని ఎలా కొంటారు.?**

బంగారుజాలలో ఉన్న అసైన్డ్ భూమికి ప్రభుత్వం గతంలోనే పట్టాలు ఇచ్చింది. అయితే ఆ భూమికి సంబంధించి సదరు రైతులకు రైతుబంధు సాయం కూడా అందుతోంది. అసలు అసైన్డ్ భూములను కొనడం, అమ్మడం కూడా చేయకూడదు. అయితే ఈ భూమిని సదరు వ్యక్తి ఎలా కొనుగోలు చేస్తాడని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. అసలు అతను అసైన్డ్ భూమిని ఎలా కొనుగోలు చేస్తాడు... అతని పేరు మీద ఎలా పట్టా వస్తుంది.. హక్కుపత్రాలు ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. సదరు భూమిపై వెళ్లిన సమయంలో తాను ఓ వ్యక్తి నుంచి ఈ భూమిని కొనుగోలు చేశానని చెప్పడంతో సదరు గిరిజనులంతా సమాచార హక్కు చట్టం కింద తహసీల్దార్ కార్యాలయంలో సదరు భూమిని విక్రయించిన వ్యక్తి పేరున ఎన్ని ఎకరాలు భూమి ఉందో అడిగారు. అయితే ఈ భూమికి సంబంధించి అలాంటి పేరున్న వ్యక్తులు ఎవరూ లేరని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు తేల్చిచెప్పడంతో గిరిజనులంతా షాక్ అయ్యారు. అయితే ఈ భూమికి అతి సమీపంలో ఎయిర్‌పోర్టు రానుండటంతో సదరు వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టాడని వారు ఆరోపిస్తున్నారు. అయితే తమకు ఈ భూమే జీవనాధారమని, ఈ భూమిపైనే ఆధారపడి తమ కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ భూమిని లాక్కుంటే మాకు ఇంకా దిక్కే లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**– జిల్లాబాస్ ఆదేశించినా కదలని రెవెన్యూ అధికారులు...**

పాల్వంచ రెవెన్యూ గ్రామ పరిధిలోని బంగారుజాల గ్రామంలో సర్వే నంబర్ 999లో ఆదివాసీ గిరిజన రైతుల పట్టా భూములను ఓ వ్యక్తి లాక్కొని సాగుచేసుకుంటున్నాడు. అయితే తమ భూములు తమకు ఇప్పించాలని స్థానిక గిరిజనులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ఈ మేరకు గత నెలలో పాల్వంచ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చి సదరు అధికారి అందుబాటులో లేకపోవడంతో రిజిష్టర్ పోస్టు చేశారు. అయినా గతంలో పనిచేసిన వీఆర్వో, సర్వేయర్లు, పోలీస్ అధికారులను వినియోగించుకొని సదరు వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని, కేటీపీఎస్ ఉద్యోగి, మాజీ ఎమ్మెల్యే అనుచరుడి దగ్గర్నుంచి ఈ భూమిని కొన్నట్లు తప్పుడు పత్రాలు చూపిస్తున్నాడన్నారు. అసలు తమ భూములను ఓ ముస్లిం వ్యక్తి నుంచి ఎలా కొనుగోలు చేస్తారని వారు ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా కలెక్టరేట్ లో ధరఖాస్తులు ఇచ్చినా వాటి గురించి విచారణ కూడా చేయడం లేదని, పేదవాడికి రెవెన్యూ అధికారులు న్యాయం చేయడం లేదని వారు ఆరోపించారు. అధికారులు పూర్తి విచారణ జరిపి అసలు పట్టాలు ఉన్న తమను ఆదుకోవాలని, తమ భూములను కాజేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యపై ప్రభుత్వ విప్, జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావును కలిసి విన్నవించనున్నామని, తమ ఆదివాసీ నాయకుడు తమను ఆదుకుంటాడనే నమ్మకంతో ఉన్నామని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**– రైతుబందు వస్తున్నా మా భూమి కాదంటున్నారు: ఎర్రబోయిన ఎల్లమ్మ**



మా జమానా నుంచే ఈ భూమిని సాగు చేసుకుంటున్నాం. ఈ భూమి మాది కాబట్టే సీఎం కేసీఆర్ సార్ మాకు పట్టాలు ఇచ్చారు. రైతుబందు కూడా వస్తుంది. కానీ ఇప్పుడు ఎవడో వచ్చి ఇది మా భూమి కాదంటూ దబాయిస్తున్నాడు. అయ్యా సీఎం సార్, మంత్రి కేటీఆర్ సార్, ఎమ్మెల్యే సార్ అందరూ ఆలోచించండి... మాకు న్యాయం చేయండి... “ఇప్పటి నుంచికాదు నేను... ఎప్పటి నుంచో ఈ భూమి కోసం తిరుగుతున్నా నాయనా... తిరగంగా తిరగంగా ఈ వయస్సుకు వచ్చాను.. అయ్యా మీరేం చేస్తారో ఏమో... నేను ముసలిదాన్ని అయిపోయా... నా భూమి నాకొచ్చేలా న్యాయం చేయండి అయ్యా... నా ఆయన ముసలయ్య కూడా లేడు. ఈ వయస్సులో భూమి కోసం తిరగలేకపోతున్నా... కాటికి పోయేంత వరకైనా నాకు న్యాయం చేయడం లేదు... నేను ఇంకేం చేయాలి... ఇంకెంత కాలం ఎదురుచూడాలి... ఈ వయస్సులో నన్ను తిప్పించుకోవడం ఏం బాగోలేదు...” పానం ఇడిసేలోగా భూమిని ఇప్పిస్తారా అంటూ ఎర్రబోయిన ఎల్లమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

**– అనేక ఏళ్లుగా భూమికోసం పోరాటం చేస్తున్నాం : జాతీయ ఆదివాసీ గిరిజన సేవక్ సంఘ్ రాష్ట్ర కన్వీనర్ బాడిశ బిక్షం**



999 సర్వే నంబర్‌లోని భూమి కోసం అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం... అందరికీ ధరఖాస్తులు చేస్తూనే వస్తున్నాం. కానీ ఎవరూ మా గోడు వినడం లేదు. విచారణ కోసం వచ్చిన వారు కూడా వెనుదిరిగారు. ఇదెక్కడి న్యాయం. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయం చేస్తారా. అయ్యా జిల్లా కలెక్టర్ గారు ... మీరు ఎంతో మంచి వ్యక్తి. మంచి పేరు పొందిన అధికారిగా ఉన్నారు. పాల్వంచ మండలంలో కబ్జాదారులు రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకొని చేస్తున్న తప్పిదాలతో అందరికీ చెడ్డపేరు వస్తుంది. పూర్తి విచారణ చేసి ఆదివాసీలు సాగు చేస్తున్న, పట్టాలు కలిసిన భూములను సర్వే చేసి ఆదివాసీలకు అప్పగించాలి. జిల్లా సర్వేయర్, మండల సర్వేయర్లను ఆదేశించి తక్షణమే సర్వే చేసి తమకు అప్పగించాలని వేడుకుంటున్నాం. లేని పక్షంలో ఎంత వరకైనా ఉద్యమం, పోరాటం చేస్తూనే ఉంటాం. మా భూమి మాకు వచ్చేంత వరకు ఊరుకునేది లేదు. పాల్వంచకు చెందిన వ్యక్తి ఈ కబ్జాలకు పాల్పడ్డాడు. అతనిపై చర్యలు తీసుకోవాలి.

# ‘దస్త్రం’ సిద్ధం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం తాజాగా విఆర్‌ఏల పట్ల కీలక నిర్ణయం తీసుకుంటూ సీఎం కేసీఆర్ కార్యాలయానికి దస్త్రం సిద్ధం చేసినట్లు సమాచారం. శేషాద్రి కమిటీ నేతృత్వంలో అందిన రిపోర్టు ప్రకారం విఆర్‌ఏలందరినీ సెప్టెంబర్ మొదటివారంలోగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. అర్హతలను పరిగణనలోకి తీసుకొని వీరందరినీ సర్దుబాటు చేయాలనే లక్ష్యంతో విధి విధానాలు, మార్గదర్శకాలను సైతం శేషాద్రి కమిటీ అప్పగించిన నివేదికలో పొందుపరిచినట్లు భావిస్తున్నారు. పదోతరగతి, ఆపైన విద్యార్హత ఉన్నవారికి మాత్రమే ఈ పదోన్నతి దక్కనునట్లు సమాచారం. రెండేళ్ల క్రితం విఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన సర్కారు నేటికి కార్యరూపం దాల్చటంతో ఈ వ్యవహారంపై కదలిక మొదలైంది. ఈ మేరకు మండలాలవారీగా సీసీఎల్‌ఏ ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. క్రమబద్ధీకరణ ప్రకారం సీఎం కార్యాలయానికి అందిన దస్త్రాన్ని పరిశీలించిన అనంతరం విఆర్‌ఏలకు పేస్కేలు అమలుచేయనున్నారు. ఆ



నాటి నుంచి నేటి వరకు కేవలం గౌరవ వేతనాలమీదనే ఆధారపడి జీవిస్తున్న వీఆర్‌ఏలకు ఇప్పటి వరకు వేతన వివరాలు ఖరారు కాలేదని రెవెన్యూశాఖ వర్గాలు స్పష్టం చేశాయి పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి మాత్రం ఈ దస్త్రం నివేదిక ద్వారా పే స్కేలు అందుకోనున్నాయి. 9వ తరగతి వరకు చదివిన వారికి మాత్రం పే స్కేలు వర్తింపజేయకుండా వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయటానికి కసరత్తు జరుగుతోంది. వీరికి సైతం గౌరవ వేతనాన్ని పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. విద్యార్హత లేనివారిని ఈ నివేదికలో పేర్కొనబడలేని విధంగా పదోతరగతి చదివిన వారికి మాత్రమే వెంటనే పదోన్నతులు దక్కనున్నాయి. డైరెక్టర్ రిక్రూట్ మెంట్ వింద వీరిని ధరణీ ఆపరేటర్లుగా నియమించబోతున్నారు. మిగిలిన వారిని నీటిపారుదల శాఖలో భర్తీ చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. అర్హతలను పరిగణనలోకి తీసుకొని తహశీల్దార్ కార్యాలయంలో కూడా కొంతమంది విఆర్‌ఒలను సర్దుబాటు చేయవచ్చనే భావన శేషాద్రికమిటీ నివేదిక రూపొందించింది. ఇదిలా ఉండగా 55 ఏళ్లు నిండిన విఆర్‌ఏల స్థానంలో వారసులకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న సుమారు 500 మంది విఆర్‌ఏలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించకముందే అర్హతలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల అసోసియేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు మొత్తం అమలు అయ్యేవరకు ప్రజాస్వామ్య వ్యవస్థలో సమ్మెలు చేయటం, డిమాండ్లు పరిష్కరించుకోవటం అనాదిగా వస్తున్న స్ఫూర్తిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విఆర్‌ఏలకు పే స్కేలు క్రమబద్ధీకరణకు పొంతన లేకుండా నివేదికలను తెప్పించుకొని తమ కు అన్యాయం చేస్తే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

# భద్రాద్రి డివిజన్‌లో సుమారు 10వేల మందికి కొత్తపెన్షన్‌లు మంజూరు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి హామీ మేరకు భద్రాచలం డివిజన్‌లో 9,676 మందికి కొత్తపెన్షన్‌లు మంజూరు అయినట్లు జిల్లా అధికారులు తెలియజేశారు. గత మూడు సంవత్సరాల నుండి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు కొత్తగా పెన్షన్‌ల కొరకు ధరఖాస్తు చేసుకుని ఎప్పుడెప్పుడు మాకు ప్రభుత్వ సహాయం అందుతుందా అని ఎదురుచూస్తున్న వారికి సెప్టెంబర్ నుండి పెన్షన్ రాబోతున్నట్లు అధికారులు ప్రకటించడంతో వారి ముఖాల్లో చిరునవ్వు వెల్లువిరిసింది. వారి జీవితాలకు ఒక భరోసా కలిగిందని ఇన్ని సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న నిరీక్షణకు ఫలితం దక్కడంతో ఇటు ముఖ్యమంత్రి కేసిఆర్, వారిని నమ్ముకున్న దైవానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు 20వేల మంది వరకు పెన్షన్‌ల కొరకు ధరఖాస్తు చేసుకోగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి డివిజన్ లోని మండలాల వారిగా ఈ విధంగా భద్రాచలం నందు 848 మంది, చర్ల 985, దుమ్ముగూడెం 1,553, బూర్గంపహాడ్ 1,665, అశ్వాపురం 1285, మణుగూరు మండలం 996, మణుగూరు మున్సిపాలిటీ 699, పినపాక 1,085,కరకగూడెం 560 మొత్తంగా భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా 9,676 మంది లబ్ధిదారులను పెన్షన్ పొందుటకు అర్హులుగా అధికారులు ప్రకటించారు.

# పరస్పర భూ వివాదం !!

# పోలీస్‌లు అత్యుత్సాహం చేశారంటూ బాధితుని ఫిర్యాదు



అశ్వారావుపేట టౌన్, ప్రభాతవార్త: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అదికారులు అందులో కీలకంగా పోలీస్ శాఖలోని సిబ్బంది తనపై దౌర్జన్యం చేసి దాడిచేశారంటూ స్థానిక ఎస్ఐపై సిఐకు ఓ బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఎనుముల వీరయ్య వారి కుటుంబానికి చెందిన 3.24ఎకరాల భూమిని నందిపాడుకు చెందిన బత్తుల జానకమ్మ స్వాధీనం చేసుకొని సాగుచేసుకుంటుందని అదేమని నిలదీస్తే నానా దుర్భాషలాడుతూ తనపై దాడికి వస్తుందని ఇదే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు రూపంలో తెలియపర్చానని బాధితుడు తెలిపాడు. కాని ఈ వ్యవహారంలో ఆక్రమిత వ్యక్తులు, స్థానికంగా గల ఓకీలకమైన ప్రజాప్రతినిధి సహకారంతో తనకు న్యాయం చేయకపోగా తనపై వ్యక్తిగతంగా దాడి చేశారంటూ ఈ దాడిలో తన వేలు విరిగిందని ఎస్ఐపై స్థానిక సిఐకు ఫిర్యాదు చేయడం గమనించాల్సిన విషయం. ఈ వివాదంలో అధికార పార్టీ వ్యక్తులు కావాలనే తనను వేధిస్తున్నారంటూ పేర్కోవడం, దానితో పాటు తనపై జరిగిన దాడిలో తనచేతి వేలు ఇరిగిపోయిందంటూ ఆధారాలు చూపించడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

# అలనాటి గురువులకు ఘన సన్మానం

## పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



వైరా,ఆగస్ట్28,ప్రభాతవార్త: వైరా వాసవి కళ్యాణ మండపంలో 1976-77 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగిది. అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులే ప్రత్యక్ష దైవంగా భావిస్తూ విద్యార్థులు తీర్చిదిద్దిన గురువులను మరిచిపోలేమని అలనాటి విద్యార్థులు అన్నారు. 45 సంవత్సరాల తర్వాత చదువుకున్న విద్యార్థులను కలుసుకోవడం గురువును కలుసుకోవడం వారిని కలుసుకోవడం చాలా ఆనందంగా, సంతోషంగా ఉందని



అన్నారు. గురువు నేర్పిన సూచనలు మనిషి అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు అందుకోవడానికి జీవితంలో స్థిరపడటానికి ఎంతో ముఖ్యమైందని, అలనాటి విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అనంతరం అలనాటి గురువులు మాట్లాడుతూ సూరి, మందయ్య, కాళికాదేవి, మిట్టపల్లి పుల్లారావు, సంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ అలనాటి విద్యార్థులను కలుసుకోవడం మాకు చాలా ఆనందంగా ఉందని, మిమ్మలినన చూస్తే మాకు అలనాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయని వారు అన్నారు. మేము తిర్చిదిద్దిన విద్యార్థులు అన్ని రంగాల్లో ఎంతో ప్రయోజకులు కావడం చూడటం మాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. గురువులు అయిన సిహెచ్.మందయ్య, వై.సంకిరెడ్డి కోటేశ్వరరావు, మిట్టపల్లి పుల్లారావు, సూరి కాళికాదేవి, అరుణదేవిలను అలనాటి విద్యార్థులు కలయిక సమ్మేళనాన్ని అనుమోలు భాస్కర్‌రావు, కొత్తూరి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తా వెంకటేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూరినత, చింతనిప్పు రవి, సంబరాజు వెంకటకృష్ణప్రసాద్, సీతామాలక్ష్మి, అనుమోలు రామచంద్రం, పొడపాటి జగన్, మిట్టపల్లి పద్మావతి, భాస్కర్‌రెడ్డి, విజయశ్రీ, రంగారావు, ఏసుదాసు, కస్తూరి, కె.కల్పన,



ఉషారాణి, అంకమ, ధూళిపాళ్ళ అన్నపూర్ణ తదితర విద్యార్థులు ఘనంగా అలనాటి గురువులను అందరూ కలిసి ఘనంగా సన్మానించారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యం



ప్రభాతవార్త ప్రతినిధి, హన్మకొండ: తెలంగాణలో పేద ప్రజల సంక్షేమం కోసం పూర్తి భరోసానిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెరాస వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తి మండలానికి చెందిన 41 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు 41లక్షలనాలు వేల 756 రూపాయల విలువగల చెక్కులను, 58 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు 20లక్షల 46వేల 500 రూపాయల విలువగల చెక్కులను హసన్‌పర్తి ఎంపిడివో కార్యాలయంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈపథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగ నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దు అనే ఉద్దేశంతో సీఎం కేసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారకర్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీణ వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కిందచికిత్సకు తగిన ఆర్థిక సాయం బాదితులకు అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, నాయకులు, పాల్గొన్నారు.

# నేరాలు-దారుణాలు

## వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:



నేలకొండపల్లి గ్రామం నందు ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయాలైనాయి. వివరాలు ఈవిధంగా ఉన్నాయి. నేలకొండపల్లి గ్రామంలోని ఖమ్మం-కోదాడ రోడ్డులోని నక్కలతూము సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రంగా గాయాలైనాయి. ముదిగొండ మండలం లోని గోకినేపల్లి గ్రామంకు చెందిన వెంకటరత్నం నేలకొండపల్లి నుంచి గోకినేపల్లి గ్రామంకు మోటార్‌బైక్ పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బలంగా డీకొనడంతో క్రింద పడి తీవ్రంగా గాయపడ్డాడని స్దానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వెంకటరత్నంను హుటాహుటిన అంబులెన్స్ వాహనంలో పోలీసులు వైద్యం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ హస్పిటల్‌కు తరలించారు. అంతకంటే కొద్ది సమయంకు ముందు బౌద్దస్దూపంకు వెళ్ళే దారి వద్ద రెండు ద్విచక్రవాహనాలు వేగంగా వచ్చి బలంగా డీకొనడంతో ఆచార్లగూడెం గ్రామంకు చెందిన మార్తి రాంప్రసాదుకు గాయాలైనాయి. తీవ్రంగా గాయపడిన మార్తి రాంప్రసాదును పోలీసులు వైద్యం నిమిత్తం హస్పిటల్‌కు తరలించారు. నేలకొండపల్లి పోలీసులు కేసులు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## బషీరాబాద్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్పూర్తితో ఉద్యమించాలి

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :




బషీరాబాద్ విద్యుత్ ఉద్యమంలో అమరవీరుల స్పూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని సీపీయం పార్టీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. బషీర్‌బాద్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల వర్ధంతి సభ మండల పరిధిలోని ములకపాడు గ్రామంలో యలమంచి సీతారామయ్య భవన్ నందు సీపీయం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. 2000వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని పోరాటం చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులపై తుపాకులతో కాల్పులు జరపడం, గుర్రాలతో తొక్కించడం వల్ల ముగ్గురు అమరవీరులు ఉద్యమంలో అమరులయ్యారని ఆయన అన్నారు. ఇప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు, గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచుతూ సామాన్య మానవుడి నడ్డి విరుస్తున్నాయని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించేతవరకు సీపీయం పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. విద్యుత్ ఉద్యమ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మర్మం చంద్రయ్య, సరియం రాజమ్మ, యలమంచి శ్రీనుబాబు, మహ్మద్‌భేగ్, గుడ్ల రామ్మోహన్‌రెడ్డి,కృష్ణ, కల్లూరిలక్ష్మయ్య, పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

భద్రాచలంక్రైం, ప్రభాతవార్త : పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకులు ధరల తగ్గించాలని, జీఎస్‌టీ ఇతర పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరరేట్ ఎదుట జరిగే ధర్నా, ప్రదర్శనను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంద జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అశోక్‌నగర్ కాలనీ, భద్రాచలంలోని పార్టీ కార్యాలయంలో శారద అధ్యక్షతన జరిగిన సభ్యుల సమావేశం జరిగింది. మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లపై జీఎస్‌టీ,ఇతర పన్నులు వేసి ధరలు పెంచుతున్నదని, కేసిఆర్ భ్రుత్వం కూడా బస్సు, కరెంటు చార్జీలకు పెంచిందని, ఇట్టి ప్రజా వ్యతిరేక విధానా లను నిరసిస్తూ సోమ వారం కొత్తగూడెంలో జరిగే ధర్నా, ప్రదర్శ నను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


**డాక్యుమెంట్లు పోయినవి**

**కొండ్ర స్వరూపారాణి వైఫ్ఆఫ్ సంజీవకుమార్, శ్రీనగర్‌కాలనీ, రోడ్డునెం.13, చంద్రవిహార్ ఫ్లాట్‌నెం.202,** ఖమ్మం నివాసం ఉంటున్న నేను ది.28.08.2022 ఆదివారం స్టేషన్‌రోడ్డులోని ఆనంద్‌భవన్ హోటల్లో టిఫిన్ చేయటానికి వెళ్లి డాక్యుమెంట్లు ఉన్న కవర్‌ను అక్కడే మర్చిపోయాను. **డాక్యుమెంట్ నెం. 3558/2013.** కావున ఈ డాక్యుమెంట్ కవర్ దొరికిన ఎడల వారు మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా **సెల్ నెం: 9949013105** లో సంప్రదించగలరు.




## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

చర్ల, ప్రభాతవార్త :




చర్ల మండలంలో గోదావరి వరదలకు గురైన వరద బాధిత ప్రజలకు తేగడ పంచాయతీ గ్రామప్రజలకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అద్యక్షులు డా.ఎస్.ఎల్.కాంతారావు, డా.భానుప్రసాద్, చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్‌లు 70 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తేగడ సర్పంచ్ అలవాల పార్వతి, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, టిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తోటమళ్ళ వరప్రసాద్, తడికల రమేష్, చింతల రాము, దుబ్బ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ఎటువంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా జరుపుకోవాలి

**-పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



వినాయక ఉత్సవాలు ఎటువంటిడ అవాంఛనీయ సంఘటన జరగకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ సంతోష్ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల సర్పంచులను గణేష్ కమిటీలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు పోలీస్ శాఖ అనుమతి, విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనలు పాటిస్తూ సహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ సయావేశంలో అదనపు ఎస్ఐ రమణారెడ్డి, సర్పంచులు, గణేష్ ఉత్సవ కమిటీలు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిలిపి వేయాలి

బూర్గంపహాడ్ ప్రభాతవార్త :

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేయాలని లేదా ఈ నిర్మాణం వలన నష్టపోతున్న తెలంగాణ ముంపు గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కరం చూపించాలని జేఏసీ మండల కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ సిరిపురపు స్వప్నకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బూర్గంపహాడ్ మండలంలోని ముంపు గ్రామాలకు పోలవరం ప్రాజెక్టు వలన ప్రమాదం పొంచి ఉందని నిరంతరం ఈ ప్రాజెక్టుతో ఎన్నో గ్రామాలు పూర్తిగా నీట మునిగాయని, ప్రజల జనజీవనం హస్తవ్యస్థం అయిందని వాపొయారు. ఈ సమస్యను సర్పంచ్ ముందు ఉండి నడిపించారని కోరారు.



# గణేష్ మండల కమిటీల వివరాలు తెలియజేయాలి

**-ప్రతి ఒక్కరి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి**

**-ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**-గణేష్ మండలాల నిర్వహణ వివరాలు తెలిపాలి**

**-సీ.ఐ నాగరాజురెడ్డి**

భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :



భద్రాచలం పోలీసు స్టేషన్ పరిధిలో మరియు వివిధ గ్రామాలలో/దమ్మపేట మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఆ కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని గుర్తించాలని పట్టణ సీ.ఐ నాగరాజురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కమిటీ సభ్యులు పంచాయతీ వారి అనుమతి తీసుకోవాలని వివిధ స్థలాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే వాళ్ళు అట్టి స్థలానికి సంబంధించిన యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్ సంస్థ నుండి అనుమతులు పొందాలని, గ్రామాలలో వివిధ కూడళ్ల వద్ద మండపాలను ఏర్పాటు చేసుకుంటున్నామని పోలీసువారికి తెలియజేయాలని సూచించారు. డీజే సౌండ్‌లకు అనుమతి అనుమతి లేదని, గణేష్ మండపాల వద్ద బూర మైకులకు అనుమతి లేదని, కేవలం రెండు సౌండ్ బాక్కులకు మాత్రమే అనుమతి అని పేర్కొన్నారు. అదేవిధంగా గణేష్ మండపాల ఏర్పాటు చేసే క్రమంలో రోడ్లు బ్లాక్ కావడం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ నేపథ్యంలో ముందస్తుగా ఆయా ప్రాంతాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసు వారికి తగు సమాచారం అందించి వారి నుండి అనుమతులు పొందిన తరువాతనే మండపాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా గణేష్ మండపం వద్ద ఏదైనా అనుకోని ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదాలు జరగకుండా వాటర్‌డ్రమ్ములు మరియు సాండ్ బకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, కమిటీ వారి పేర్లు, ఫోన్ నెంబర్లు అన్ని పోలీసు స్టేషన్ నందు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఉన్నట్లయితే వాటిని కూడా అమర్చుకోవాలని, గణేష్ విగ్రహం యొక్క ఎత్తు మరియు మండపం యొక్క పరిధిని తెలుపాలని, నిమజ్జనం తేదీ, మీరు నిమజ్జనం చేయు స్థలం ఎప్పుడు, ఎక్కడో ఖచ్చితంగా తెలపాలని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లకు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు విజయవంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

## సిపిఐ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయండి

సారపాక ప్రభాతవార్త :



సారపాక కాపర్ది భవన్‌లో ఆదివారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం లోకిరెడ్డి, శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ముర్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత మహాసభల నుంచి ఈ మహాసభల వరకు జరిగిన కార్యక్రమాలు చర్చించి పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.రాజా దిశ నిర్దేశం చేయనున్నారని తెలిపారు. అంతే కాకుండా బూర్గంపహాడ్ మండలంలో ప్రధాన సమస్యలతో పాటు గోదావరి ముంపు ప్రాంతాల సమస్యను ప్రధాన ఎజెండాగా చర్చించి కార్యక్రమాలకు రూపాకల్పన చేయనున్నామని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే పట్టించుకోనే నాదుడే వాపోయారు. ఇప్పటికి అయిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కొకపోతే జరగబోయే పరిస్థితులకు పూర్తి బాధ్యత వారిదే అని అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శులు పాండవుల భిక్షం, సిద్ధారపు సుబ్బారెడ్డి, ఏఐటీయుసీ నాయకులు సాజీద్, సిపిఐ మండల కార్యవర్గసభ్యులు సబ్కా నాగేశ్వరరావు, దాసరి మలుసురు, జాహుర్, ముదిగొండ బాలకృష్ణ, బర్ల వెంకటేశ్వర్లు, సొల్లు పుల్లయ్య పాల్గొన్నారు.

## పర్యావరణానికి మట్టి విగ్రహాలే మేలు

**-కంభంపాటి సురేష్ కుమార్**

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, కావున భద్రాచలం పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విగ్రహాలను వ్యాపారస్తులు, ప్రజలందరూ కలిసి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కంభంపాటి సురేష్ కుమార్ ఈ మేరకు భద్రాచలం పట్టణంలో స్థానిక కోమల స్కూల్ నందు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత మట్టి విగ్రహాల తయారీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారస్తుడు ధారా బాలాజీరావు కుమారుడు ముక్తేశ్వరరావు చిన్న పిల్లలకు మట్టి విగ్రహాలు తయారు చేసే విధానం నేర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫౌండేషన్ కన్వీనర్ మురళీ మోహన్ కుమార్ మాట్లాడుతూ మట్టి వినాయక చవితిని, ప్లాస్టిక్ రహిత వినాయక చవితి జరిగేలాగా ప్రతి ఒక్కరూ సహకరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అందరూ తమ చేతులతో మట్టి విగ్రహాలను తయారు చేసి మట్టి విగ్రహాన్ని పూజిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం అని నినదించారు. ఫౌండేషన్ సభ్యురాలు హన్సి, అపర్ణ, నాగ మోహన్, వేమూరి పవన్ కుమార్, స్వయంప్రభ, యాసుఫ్మియా తదితరులు పాల్గొన్నారు.

## అమర వీరుల స్ఫూర్తితో విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

బషీర్బాగు విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వం సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీయం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. బషీర్బాగ్ విద్యుత్ పోరాట అమరవీరులు 22వ వర్థంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్‌బాబు అద్యక్షతన సీపీయం కార్యాలయం నందు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి మాట్లాడుతూ .. 2000 సంవత్సరంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయాలనే ప్రయత్నానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా ఉద్యమం విద్యుత్ వ్యతిరేక పోరాటమని అన్నారు. సీపీయం, వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొనసాగిన విద్యుత్ పోరాటం ప్రజా ఉద్యమంలో సాగి 2000 ఆగష్టు 28వ తేదీన ఛలో హైద్రాబాద్ పిలుపునివ్వడం




జరిగిందని, ఆ సందర్భంగా వీరోచతంగా పోరాడుతున్న ప్రజలపై నాటి ప్రభుత్వం పాశవికంగా దాడి చేసిందని, గుర్రాలతో తొక్కించి, లాఠీలు జులిపించి, తుపాకీ తూటాలు పేల్చడంతో ముగ్గురు అమర వీరులు సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలు అక్కడిక్కడే మృతి చెందారని వందలాది మంది ప్రజలకు తుపాకీ తూటాలు తగిలాయని అన్నారు. ఈ పోరాటంలో నాడు అమలు చేయాలని చూసిన సంస్కరణలను నాటి ప్రభుత్వం అనివర్యంగా వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. నేడు కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సవరణ చట్టం పేరుతో మొత్తం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని, విద్యుత్ ఉత్పత్తి – పంపిణీ అంతా కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుని రాష్ట్రాల హఖ్కులను హరిచేందుకు పూనుకుంటుందని విమర్శించారు. కేంద్ర విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజలు, కార్మికులు ఐక్యమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముందుగా విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు ఎంబీఎస్ నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటరామారావు, పారెల్లి సంతోష్‌కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఎన్.నాగరాజు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, నాయకులు బిజేఎల్‌పీ దాసు, తదితరులు పాల్గొన్నారు.

# చిరునోములలో పలు కుటుంబాలను పరామర్శించిన తమ్మినేని

*బోనకల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :*
సీనియర్ పాత్రికేయుడు బోనకల్ మండల నవ తెలంగాణ విలేకరి తేనె వెంకటేశ్వర్లుని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం పరామర్శించారు. మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తేనె వెంకటేశ్వర్లుకి ఇటీవల గుండెకు సంబంధించిన వైద్య చికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలిసిన తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావుతో కలిసి తేనె వెంకటేశ్వర్లని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... త్వరగా కోలుకొని తిరిగి తన విధులను యధావిధిగా నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తెల్లబోయిన రామారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట సీపీఎం చింతకాని మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సీపీఎం చిరునోముల శాఖ కార్యదర్శి నిమ్మల రామారావు, మాజీ ఎంపీటీసీ నిమ్మతోట ఖానా, మాజీ ఉప సర్పంచ్ నీలకంఠం, రాము, సీపీఎం చిరునోముల మాజీ శాఖ కార్యదర్శి పతంగి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు వేము రామయ్య, పరిస పుల్లయ్య, అల్లిక రంగయ్య, రేగళ్ళ శ్రీనివాసరావు, రేగళ్ళ చిన్ని, సావిటి వెంకన్న, టీఆర్ఎస్ గ్రామ శాఖ అద్యక్షుడు గరపాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కవిత ఇంటిపై దాడిని ఖండించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



**జనగామ టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**
ఎమ్మెల్సీ కవిత ఇంటిపై దాడిని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకలజమున లింగయ్య ఖండించారు. ఆదివారం కవిత నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శిం చారు. ఈసందర్భంగా జమున మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఇంటిమీద బీజేపీ కార్యకర్తలు చేసిన దాడి హేయమైన చర్య అని, కేసీఆర్ మీద కక్షసాధింపు ధోరణితో కావాలనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలలో ముఖ్యమంత్రికి వస్తున్న మద్దతును ఓర్వలేకనే ఈ దాడిచేశారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలకు చెందిన నేతలపై ఒక పద్ధతి ప్రకారం దాడులుచేయిస్తుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కొంతకాలంగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విషయం అందరికి తెలిసిన విషయమేనని, కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనే లక్ష్యంతో కవితను లక్ష్యంగా చేసుకుని బదన్నా చేస్తున్నారన్నారు. తెలంగాణ సమాజం మరి ముఖ్యంగా మహిళలు కవిత వెన్నంటే ఉన్నారని తెలిపారు. పరామర్శించిన వారిలో జనగామ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు జూకంటి లక్ష్మీ శ్రీశైలం, వాంకుడోతు అనిత, పగిడిపాటి సుధా సుగుణాకర్‌రాజు, పాకరమ, గుర్రం భూలక్ష్మీ, మల్లిగారి చంద్రకళ, పేర్ని స్వరూప, బండపద్మ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు పానుగంటి రాహేళ, జాగృతి నాయకులు అనంతుల ఆంజనేయులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కానిస్టేబుల్ రాత పరీక్ష

**భూపాలపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష సజావుగా ముగిసింది. ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు రాత పరీక్ష నిర్వహించగా జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాలను ఎస్పీ సురేందర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించి పోలీస్ అధికారుల నుండి ఎప్పటి కప్పుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పకడ్బందిగా పరీక్షలు నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్ష పోలీస్ నోడల్ అధికారి అడిషినల్ ఎస్పీ శ్రీనివాసులు, రీజినల్ కో ఆర్డినేటర్ ఎంఎస్ మూర్తి, సీఐ సిహెచ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.





# దేశంలోనే నెంబర్‌వన్ తెలంగాణ రాష్ట్రం



**జఫర్‌గడ్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రం ఏపథకంలోనైనా నెంబర్‌వన్ రాష్ట్రంగా ఉననదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య అన్నారు. ఆదివారం జఫర్‌గడ్ మండలంలోని 1052మంది పెన్షన్ దారులకు కార్డులను పంపిణీచేశారు. ఎమ్మెల్యేరాజయ్య మాట్లాడుతూ రాష్ట్రాలలో 46లక్షల మందికి వివిధ రకాలైన ఆసరా పెన్షన్‌లు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక తెలంగాణ రాష్ట్రంలోని వృద్ధాప్య పెన్షన్లు ఇచ్చే వయోపరిమితిని 57సంవత్సరాలకు తగ్గించి 57సంవత్సరాలు పైబడిన వారందరికి వృద్ధాప్య పెన్షన్లు ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల కొత్తపెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, రానివారు ఎవరునాన కూడా తిరిగి దరఖాస్తు చేసుకుంటే అలాంటి వారికి తప్పక ఆసరా పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుం దన్నారు. ఆసరా పెన్షన్ మంజూరు ప్రక్రియ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ఇప్పుడు రానంతమాత్రాన ఎవరు బాధపడకూడదని, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఆసరాపెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ బేబి శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ గుజారి రాజు, వైస్ ఎంపీపీకనకయ్య, ఎంపీటీసీలు రజిత, స్రవంతి, సర్పంచ్‌లు వెంకట నరసింగ రావు, అశోక్, ఇల్లందుకుమార్, నీరజారెడ్డి, పొన్నాల జ్యోతి, రైతు కోఆర్డినేటర్ శంకర్, మార్కెట్ డైరెక్టర్ రాజు, వరుణ్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.




## జానికిరామయ్యని పరామర్శించిన తమ్మినేని



*చింతకాని, ఆగస్టు 28, ప్రభాతవార్త :*
అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న మండల సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు కొంద్రు జానికిరామయ్యను సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం పాతర్లపాడులోని జానకిరామయ్య నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్దితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాతర్లపాడు గ్రామ సీపీఎం సీనియర్ నాయకులు మిడిదొడ్ల సత్యంను పరామిర్శంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, మండల కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, మండల కమిటీ సభ్యులు కాటబత్తిన వీరబాబు, పంగా గోపయ్య, దేశబోయిన ఉపేందర్, నాయకులు నెల్లూరి వెంకటేశ్వర్లు, దామాల రవి, నున్న రామకోటయ్య, పులి శేఖర్, టీఆర్ఎస్ నాయకులు సామినేని అప్పారావు, మండెపూడి కృష్ణ, సీపీఐ నాయకులు తాళ్ళూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫన ఫండ్ చెక్కుల అందజేత



*చింతకాని, ఆగస్టు 28, ప్రభాతవార్త :*
మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మెట్టెల లక్ష్మీబాయికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ యువజన మండల అద్యక్షులు బందేల నాగార్జున ఆదివారం అందజేశారు. మధిర శాసన సభ్యులు సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మెట్టెల లక్ష్మీబాయికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండేపూడి రంగయ్య, తాళ్లూరి రమేష్, కోపూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య గుండెపోటుతో మృతి

*బోనకల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :*



మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెల్లబోయిన తిరుపతయ్య (70) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలు రాజకీయ పార్టీలు ఆయన కుటుంబానికి సంతాప సానుభూతి తెలిపారు.




## హెల్త్ డైరెక్టర్‌ను కలిసిన శ్యాంకుమార్

*కొత్తగూడెం టౌన్, ఆగస్టు 28 - ప్రభాతవార్త:*



తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావును జిల్లా ది నేషనల్ కన్స్యూమర్ ఫోరం వైస్ చైర్మన్ ఊదరి శ్యాంకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉన్నటువంటి ల్యాబ్‌లలో ప్రభుత్వం నియమించిన ధరల పట్టికలను పెట్టకపోవడం, అదే విధంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో విపరీతమైన ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. దీనిపై హెల్త్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

*పాల్వంచ రూరల్, ఆగస్టు 28 - ప్రభాతవార్త:*



మండలంలోని జగన్నాథపురం జనని ఫంక్షన్ హాల్‌లో కిన్నెరసాని ఆశ్రమ పాఠశాల 1993-94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారి గురువులను ఈ సందర్భంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారామరాజు, నిర్మల, వెస్లీ, పద్మావతి, ద్రౌపది, పుష్పకుమారి, ఆనంద్‌కుమార్‌లను సన్మానించుకున్నారు.

## రాజీవ్ పార్కులో క్రికెట్ మ్యాచ్ వీక్షించిన పట్టణ ప్రజలు

*కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:*




ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం రాజీవ్ పార్కులో ఇండియా, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రేక్షకులు వీక్షించారు. ఇందుకోసం కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు కమిషనర్ నవీన్‌కుమార్ ఈ ఏర్పాట్లు చేయించారు. దీంతో క్రికెట్ అభిమానులు, పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




# అంతా... 'ఓపెన్'గా...



(మొదటి పేజీ తరువాయి)

మొన్నటి వరకు రెగ్యులర్, ఇప్పుడు ఓపెన్ డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ పరీక్షకు హాజరయ్యే వారంతా డబ్బులు చెల్లిస్తే చాలంటా.. ఆన్సర్లు మొత్తం అధ్యాపకులే చెప్పేస్తున్నారంటా... ఇది అందరికీ తెలిసిన పెద్ద రహస్యం... అతను పేరుకు మాత్రమే 'చిన్న' చేసేవన్నీ పెద్ద పనులే నంటూ... పలువురు ఆరోపిస్తున్నారు.

**- రెగ్యులర్, ఓపెన్ డిగ్రీ పరీక్షలకు ఫుల్ సపోర్ట్**

పరీక్షల్లో గోల్‌మాల్ గందరగోళం సృష్టించాలంటే దానికి కేరాఫ్ అడ్రస్‌గా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిలుస్తోంది. తాజాగా జరిగిన డిగ్రీ రెగ్యులర్, ప్రస్తుతం జరుగుతున్న ఓపెన్ డిగ్రీ పరీక్షలకు లెక్చరర్లు ఫుల్ సపోర్టు ఇచ్చి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించినట్లు పలువురు చెప్తున్నారు. అయితే ఇందుకు సంబంధించి ఫోటోలు కూడా బహిర్గతమయ్యాయి. అయితే ఇక్కడ ఎంత మందికి అయితే సెంటర్ కేటాయించారో, పరీక్షకు ఎంత మంది వస్తున్నారో వారి పేర్లు, ఫోన్ నంబర్లు ఆధారంగా లిస్టు తయారు చేసుకొని ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారో పక్కన రాసుకొని వారి చేత సంతకం పెట్టుకుంటున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి ఖచ్చితంగా హెల్ప్ చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించి అభ్యర్థుల లిస్టు తయారు చేసుకొని ఆ లిస్టు ఆధారంగా కాపీలు అందిస్తున్నారు. కొంత మందికైతే ఏకంగా సెల్‌ఫోన్లు అనుమతిస్తూ వారు అందులో చూసి రాసుకునేలా సహకారం అందిస్తున్నారు.

**- డిబార్ అయిన వ్యక్తితో పరీక్ష రాయించిన ప్రిన్సిపాల్.?**

కాకతీయ యూనివర్సిటీ తరపున ఈ నెల 23వ తేదీన జరిగిన పరీక్షలో విద్యార్థి సెల్‌ఫోన్‌తో పరీక్ష రాస్తున్నప్పుడు ఇన్విజిలేటర్ గుర్తించారు. అయితే సదరు విద్యార్థి నుంచి హాల్ టిక్కెట్ నంబర్, సంతకం, అటెండెన్స్ నంబర్ ఫోటో తీసుకొని అతన్ని పంపించేశారు. కానీ సదరు ప్రిన్సిపాల్ మాత్రం ఆ వ్యక్తిని మరలా 24వ తేదీన కాలేజీకి పిలిపించారు. కళాశాలలో తరగతులు జరుగుతుండగా తరలి గదిలో సదరు వ్యక్తితో పరీక్ష రాయించారు. అతనొక్కడే పరీక్ష రాశాడు. ఇదేం విడ్డూరం... పరీక్షా కేంద్రం నుంచి బయటికి పంపించినా కానీ సదరు విద్యార్థుల బంధువులు, తెలిసిన వారితో పరీక్ష రాయించి జవాబు పత్రాలను సీల్ వేసి పంపించడం వెనుక ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే ఒక మహిళా ఉద్యోగిని కూడా ఇలానే పరీక్షలో పట్టుబడితే సదరు ప్రిన్సిపాల్ ఆమెను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇన్విజిలేటర్ల వద్ద నుంచి అన్ని పేపర్లు తీసుకొని పరీక్ష ముగిసే సమయానికి జవాబు పత్రాలను కవర్‌లో పెట్టి సీల్ వేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**- పరీక్షకో రేటు... ఇస్తే పాస్ గ్యారెంటీ...**

ప్రస్తుతం పాల్వంచ డిగ్రీ కాలేజీలో ఓపెన్ డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఈ పరీక్షల్లో కూడా ప్రిన్సిపాల్ తన చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.600 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసే వారిలో ఉద్యోగులు ఎవరైనా ఉంటే మాత్రం వారి వద్ద నుంచి భారీగానే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కానీ ఈ కళాశాలకే ఇటీవల అవార్డు రావడం విడ్డూరంగా ఉందని పలువురు చెప్తున్నారు. ఇంత దందా జరుగుతున్నా కళాశాలకు అవార్డు రావడం ఏంటని పలువురు ఆరోపిస్తున్నారు.

**- ఏం.. పర్వాలేదులే అంటున్న ప్రధానాచార్యులు.?**

ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్... జిల్లా అధికారులు ఎవరు విజిట్‌కి వచ్చినా నేను మేనేజ్ చేసుకుంటా... మీకు ఏం పర్వాలేదంటూ కళాశాల ప్రధానాచార్యులు అభయహస్తం ఇస్తున్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయి. ఎందుకంటే కళాశాలలో ఇలా కాపీలు జరుగుతున్నా ప్రధానాచార్యులుకు తెలియకుండా అయితే జరగదు కదా... అలా జరుగుతుందంటే ఆయన ప్రోద్బలం కూడా ఉందనే చెప్పాలని పలువురు చెప్తున్నారు. పాల్వంచ పట్టణం చివరన జాతీయ రహదారి పక్కన కళాశాల ఉన్నప్పటికీ మాస్ కాపీయింగ్ యధేచ్ఛగా జరుగుతుందంటేనే అర్థం చేసుకోకతప్పదు... అభ్యర్థుల నుంచి వారు ఎంత వసూలు చేస్తున్నారో అని.. అయితే డబ్బులు ఇచ్చిన వారు కూడా గుట్టుచప్పుడు కాకుండా పరీక్ష రాసి వెళ్లిపోతున్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపించి మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



**డబ్బులు ఇచ్చిన విద్యార్థుల వివరాలతో తయారు చేసిన లిస్టు ఇదే**

# వరద బాధితులకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

*చర్ల ప్రభాతవార్త :*



భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో గోదావరి వరదలకు గురైన వరద బాధిత ప్రజలకు గోమ్ముగూడెం కొత్తగట్ల గాంధీనగరం, గ్రామల ప్రజలకు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు విశ్రాంతి ఉపాధ్యాయుడు దొడ్డి తాతారావు ప్రతిపాదన మేరకు ఖమ్మం జిల్లా విశ్రాంతి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎలమధి వెంకటేశ్వర్లు(వై.వి.), పూనాటి వెంకటేశ్వర్లు, సిరిపురపు రమణారావు, సాదినేని భాస్కరరావు, టాటా రాఘవయ్య, కె.వి.నాయుడు, నల్లమోతు సురేష్‌బాబు, వెల్లిశెట్టి నరసింహారావు, కోడుమూరు లక్ష్మణ మూర్తి వీరూ 206 కుటుంబాలకు చీరలు దుప్పట్లు విద్యార్థులకు నోట్‌బుక్స్ మొత్తం రూ.1,50,000 విలువైన సామన్లు పంపిణీ చేసారు. వరదల వల్ల వేల కుటుంబాలు నష్టపోయాయని కొంతమందికి అయిన హెల్పింగ్‌హ్యాండ్ ఇవ్వాలని ఆలోచనతో సుధీర ప్రాంతమైన ఖమ్మం నుండి రిటైర్ ఉపాధ్యాయులు నేడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తులో అలిసిపోయి ఉండీ ప్రజాసేవ కార్యక్రమములు చేస్తునందుకు ఈ మూడు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో చర్ల మండల టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నక్కినబోయిన శ్రీనివాస్‌యాదవ్, పిఏసీఎస్ డైరక్టర్ ముమ్మినేని అరవింద్, బ్రహ్మానందరెడ్డి, పటాన్ మహబూబ్, సోషల్ మీడియా ఇన్చార్జి పంజారాజు పాల్గొన్నారు.

# వజ్ర సంకల్పం దివ్యాంగుల సొంతం

**- హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు**

*కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:*



వజ్ర సంకల్పం దివ్యాంగుల సొంతమని తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం శ్రీనగర్ ఏరియాలోని డాక్టర్ గడల శ్రీనివాసరావు నివాసంలో టీవీపీఎస్ అధ్యక్షుడు గుండపనేని సతీష్ ఆధ్వర్యంలో దివ్యాంగులు మర్యాద పూర్వకంగా కలిశారు. దివ్యోత్సవానికి మీ సహకారం గొప్పదని వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాబా, మేడి ప్రవీణ్‌కుమార్, గట్ల రమేష్, హుస్సేన్ మియా, కాటి నాగేశ్వరావు, చాంద్‌పాషాలు పాల్గొన్నారు.

# విద్యాలయాలు కాషాయ నిలయాలు కావొద్దు

<u>కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>

విద్యాలయాలు కాషాయ నిలయాలు కావొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చావా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తుందని, విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడాలని,





విద్యాలయాలు మత, కుల నిలయాలు కాకూడదని పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. విద్యుత్ సవరణ చట్టం వల్ల సబ్సిడీ ఉండదని, రైతులకు ఉచిత విద్యుత్ ఉండదని, ఆదానీ, అంబానీలు మోడీకి పెద్ద కొడుకు, చిన్న కొడుకులని, మోడీ ప్రభుత్వం సహజ వనరులను దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. ఈ మహాసభల్లో జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు, వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

<u>కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్‌వో అశోక్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల సమస్యల ధరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

## ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

<u>చుంచుపల్లి, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



ఎంఎసెట్‌లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరి రోజు కావడంతో 250 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. మొత్తం 1601 మంది ఈ పరిశీలనలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ నాగముని నాయక్ వెల్లడించారు.

## ముత్యాలమ్మగుడిలో అన్నదానం

<u>పాల్వంచ, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>

పాల్వంచ పట్టణ పరిధిలోని గాంధీనగర్ 5వ వార్డులో 1951 సంవత్సరంలో పెద్దపాల చెట్టు కింద వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో జూలై 29వ తేదీ నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 28 తేదీ ఆదివారం అన్నదాన కార్యక్రమంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా ఇంచార్జి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సాంప్రదాయ ప్రకారం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గంగపురి నాగేశ్వరరావు, పూజారి భాస్కర్‌దాస్, కేసుపాక వెంకటేశ్వర్లు, బంక రాము, గూడపాటి నర్సింహారావు, దుర్గాప్రసాద్, దాట్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేడు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సమావేశం

<u>కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



ఈ నెల 29వ తేదీన ఖమ్మం గ్రౌండ్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాశీహుస్సేన్ తెలిపారు. కొత్తజిల్లాలకు నూతన ఆఫీస్ బేరర్‌లను ఎన్నుకునేందుకు రాష్ట్ర అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ సమావేశం నిర్వహించనున్నామని అన్నారు. అసోసియేషన్ సభ్యులందరూ ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

## దశదిన కార్యక్రమాల్లో పాల్గొన్న కొత్వాల

<u>పాల్వంచ, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల మరణించిన వారి దశదిన కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్‌లు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పున్నమ్మ స్కూల్ ప్రాంతంలో ప్రముఖ సెల్, జిరాక్స్ సెంటర్ వ్యాపారి సూరత్ మురళి గాంధీ బావ, రిటైర్డ్ కేటీపీఎస్ ఫోర్‌మెన్ మాచిరెడ్డి రంగారావు ఇటీవల మరణించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఒడ్డుగూడెంలో కటిక వాసు తండ్రి కటిక వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## జాతీయ రహదారిపై గుంతను పూడ్చిన జనసేన

<u>పాల్వంచ, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>

మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురు జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు గుంత ఏర్పడింది. దీంతో జనసేన పార్టీ కార్యకర్తలు ఆ గుంటను పూడ్చారు. ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించారు. దీంతో పలువురు వారిని అభినందించారు.






## ఎంఎంఎస్ జిల్లా కమిటీ ఎన్నిక

<u>చండ్రుగొండ, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



ఎంఎంఎస్ వ్యవస్థాపకుడు మహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. స్టేట్ ప్రెసిడెంట్ యాకూబ్‌పాషా, భద్రాచలం మండల అధ్యక్షుడు మస్తాన్, అశ్వాపురం మండల అధ్యక్షుడు యాకూబ్ సమక్షంలో ఈ కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌డీ బాద్‌షాను నియమించారు. సభ్యులుగా ఎస్‌కే హుస్సేన్, పటాన్ నాగుల్ మీరా, ఎస్‌కే పాషా, ఎస్‌కే నబీ, కరీముల్లా, సైదా, సయ్యద్ కుర్తీక్‌లను ఎన్నుకున్నారు.

## బీఎంఎస్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

<u>కొత్తగూడెం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ కార్పోరేట్, ఏరియా ఆధ్వర్యంలో బీఎంఎస్‌భవన్‌లో పర్యావరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యదర్శి పి.మాధవ్ నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవ చరిత్రను వివరించారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రభాకర్‌రావు, సంగం చందర్, జీవీ కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, పవన్‌కుమార్, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, నర్రా సంపత్‌రావు, యాదగిరి, గంధం సతీష్, కృష్ణ, యాకూబ్, వీఎన్ మూర్తి, ఉమా మహేశ్వరరావులు పాల్గొన్నారు.

## కోవిడ్ ప్రికాషన్ డోస్‌ను వెంటనే పూర్తి చేయాలి

<u>లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>

వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సమాఖ్య సభ్యులు, పంచాయతీ కార్యదర్శులుగా కలిసి కట్టుగా పనిచేసి మండలంలో ప్రికాషన్ డోస్‌ను పూర్తి చేయాలని ఎంపీడీవో రామారావు తెలిపారు. శనివారం కలెక్టర్ నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో సూచించిన విషయాలను ఆయన వివరించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామ పంచాయతీల్లోని సబ్ సెంటర్లు, గ్రామ పంచాయతీ మొత్తం, పీహెచ్‌సీ సెంటర్లలో ఎవరైతే వ్యాక్సినేషన్ వేయించుకోకుండా ఉన్నారో వారికి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమాన్ని ఫోటోస్, వీడియోస్ తీసి పెట్టాలని, నూటికి నూరుశాతం విజయం చేయాలని అందరూ పాటుపడాలని సూచించారు.

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు

<u>కొత్తగూడెం టౌన్, ఆగస్టు 28 - ప్రభాతవార్త:</u>



మాలవమానాడు జాతీయ అధ్యక్షుడు వెల్తూరు మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి మల్లిపెద్ది చంద్రశేఖర్‌లను జిల్లా అధ్యక్షుడు కూరపాటి రవీందర్ కలిశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగిన సంస్మరణ సభలో పాల్గొన్న జాతీయ నాయకులను ఆయన ఈ సందర్భంగా పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి గడ్డం వివేక్, జి.చెన్నయ్య, తలమల్ల హాసన్, గిడ్ల పరంజ్యోతిరావు, మన్నె బాబురావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# వరిసాగుపై "అనాసక్తి"

**-వరి వ్యవసాయంపై మోజు చూపని రైతులు**

**-అధిక పెట్టుబడి తక్కువ గిట్టుబాటు ధరనే కారణం**

**-దుమ్ముగూడెం మండలంలో తగ్గనున్న వరి సాగు**



<u>*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*</u> వ్యవసాయ ఆధారిత మండలమైన



దుమ్ముగూడెంలో వరి వ్యవసాయ సాగుపై రైత్నలు అనాసక్తిని చూపుతున్నారు. వరి వ్యవసాయానికి అధిక పెట్టుబడులే అందుకు కారణమని, రైతన్నలు వరి వ్యవసాయంపై అనాసక్తిని చాటుతున్నారు. ఆరుగాలం కష్టబడి పండిస్తున్న వరిపంటకు సరైన గిట్టుబాటు ధర లేక పండించిన పంటను దళారులకు తక్కువ రేటుకు అమ్ముకుంటూ నష్టాలను చవిచూడడమే ఇందుకు కారణం. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ఎఫ్‌సీఐలో అమ్ముకుందామంటే వారు పెట్టే నియమ నిబంధనలకు విసుగుచెందిన రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవడం పరిపాటిగా సాగుతుంది. దుమ్ముగూడెం మండలంలో గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం ఖరీఫ్ సీజనల్‌లో వరి వ్యవసాయ సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. వరి వ్యవసాయానికి ఎకరానికి స్వంత పొలం ఉంటే ఎకరానికి రూ.30వేల నుండి రూ.35వేల వరకు పెట్టుబడి అవుతుంది. అదే కౌలుదారుడైతే రూ.40వేల పైచిలుకు మాటే. తీరా కష్టపడి పండించిన వరిపంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతన్నలు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. ఎకరానికి 30 బస్తాలకు మించి పండకపోవడం ఇందుకు కారణమవుతుంది. సన్నరకం వరి విత్తనాలు వేసిన రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం వలన తీవ్రంగా నష్టపోతున్నారు. 1001, 1010 రకం విత్తనాలతో సాగు చేసే రైతులు పండిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదో .. తీరా పండిన తరువాత ప్రభుత్వాలు ఆ రకం వడ్లను కొనకపోతే మన పరిస్థితి ఏంటని ఆందోళన చెందే రైతులు నీటి సౌకర్యం సరిగా లేని భూములను బీడు భూములుగానే ఉంచుతున్నారు. కౌలుకు అడిగే నాధుడే లేడు. ఒకప్పుడు వరి వ్యవసాయం చేసే రైతులు తమకు భూములు లేకపోయినా ఎట్టి పరిస్థితిలోనైనా కౌలుకు తీసుకుని వరి వ్యవసాయం చేయాలని తాపత్రతతో ముందుగానే డబ్బు కౌలుకు ఎకరానికి రూ.11వేల నుండి రూ.14 వేల వరకు చెల్లించి అడ్వాన్స్‌గా భూములను కౌలుకు తీసుకునే వారు. రాను రాను ఆ పరిస్థితిలో మార్పు వచ్చి వరి వ్యవసాయం చేయుటకు, కౌలు తీసుకొనుటకు ముందుకు వచ్చే నాధుడే కరువయ్యాడు. అదీ కాకుండా ఎకరానికి 10 నుండి 12 బస్తాలు కౌలు చొప్పున మాట్లాడుకొని వ్యవసాయం పనులు చేసే కౌలు రైతులు ఎకరానికి 8 నుండి 10 బస్తాలు ఇవ్వమన్నా ఆసక్తిని చూపడం లేదు. దీంతో వరి వ్యవసాయంపై విరక్తి వచ్చిన రైతులు తమ భూములను బీడు భూములుగానే ఉంచుతున్నారు. ఒకపోతే ఆకాశవాయలుగా పిలిచే వర్ష ఆధారిత భూమల్లో వరి పంటకు బదులు ప్రత్యామ్నాయాన్ని రైతులు చూసుకుంటున్నారు. వ్యవసాయ సాగునీరు సమృద్ధిగా ఉండే ప్రాంతాలైన తాలిపేరు ప్రాజెక్టు కింద ఆయకట్టు భూముల్లో, ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఉన్న భూముల్లో, చిన్నగుబ్బలమంగీ కింద ఉన్న ప్రాజెక్టులలో మాత్రమే రైతులు తమ వరి వ్యవసాయ పనులను మొదలు పెట్టారు. గత సంవత్సరం దుమ్ముగూడెం మండలంలో సుమారు 25వేల ఎకరాల్లో వరిపంటను పండించారు. కానీ ఈ సంవత్సరం 15వేల ఎకరాలకు మించి వరి వ్యవసాయం రైతులు చేయడం లేదనే మాటలు వినవస్తున్నాయి. ఏదిఏమైనా రైతే దేశానికి వెన్నుముకగా పిలిచే రైతులు వరి వ్యవసాయ సాగుపై అనాసక్తిని చూపడం పట్ల ముందు ముందు వరి వ్యవసాయ సాగు ప్రశ్నార్ధకరంగా మారే ప్రమాదం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు రైతులు వరి పంటను సాగు చేసి ఆర్థికంగా నిలతొక్కుకునేందుకు మరిన్ని ప్రణాళికలు ప్రభుత్వాలు రచించాల్సిన అవసరం ఉంది.

# శ్రీవేంకన్నస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ రేగా

<u>*మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు28:*</u>



ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు కుటుంబ సమేతంగా ఆదివారం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రేగాకు టీటీడీ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు , పట్టు వస్త్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ వారి కుటుంబం బాగుండాలని, జిల్లా ప్రజలు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా తమిళనాడు రాష్ట్రంలోని వెల్లురు గోల్డెన్ టెంపుల్‌ను కుటుంబ సమేతంగా దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు వట్టం రాంబాబు, టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎన్ రాజు, చందా హరికృష్ణ, పోలెబోయిన అనిల్ కుమార్, గుమ్మడివెల్లి ప్రసాద్, వేణు, సంగీత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీ సంఘం పేరుతో పోలీసులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

**- ఆకాశరామన్న ఆదివాసీ సంఘం సృష్టికర్తలు పోలీసులే : ఆజాద్**



<u>*చర్ల, ప్రభాతవార్త :*</u>

మావోయిస్టు పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా యుద్ధాన్ని నిర్మూలించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సమాధాన్ ప్రహార్ దాడిలో భాగంగానే పార్టీపై తప్పుడు ప్రచారం చేయడానికి పోలీసులు, ఎస్పైబీ సృష్టించిందే ఈ ఆదివాసీ సంఘం. ఆదివాసీ ప్రజల హక్కులను మావోయిస్టు పార్టీ కాలరాస్తుందని ఆదివాసీ సంఘం పేరిట తరుచూ కరపత్రాలు, పోస్టర్లు వేసి ప్రజల్లో గందరగోళం పోలీసులు సృష్టిస్తున్నారని మావోయిస్టు భద్రాద్రికొత్తగూడెం, అల్లూరిసీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పత్రికలకు లేఖ విడుదల చేశారు. ఆదివాసీ సంఘం పేరుతో వెలుస్తున్న పోస్టర్లు ఎవరు వేస్తున్నారో అందరికి తెలుసునని అన్నారు. ఊరు .. పేరు లేని ఒక సంఘాన్ని తయారు చేసి దాన్ని అడ్డుపెట్టుకుని ఉద్యమంపై ఆరోపణ చేయడం అంటే అది ఆదివాసీలపై ఆరోపణ చేయడమేనని విమర్శించారు. నగ్జల్బరీ ఉద్యమం మొదలుకొని నేటి దండకారణ్యం వరకు ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ తమదన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజ సంపదను దోచుకుపోకుండా ఆదివాసీలను చైతన్యం చేసింది మావోయిస్టు పార్టీ. ఈ క్రమంలో పార్టీ ఎందరినో కోల్పోయిందని అన్నారు. అటువంటి త్యాగాల చరిత్ర మా పార్టీది అని అన్నారు. ఊరు .. పేరు లేని కొన్ని సంఘాలను సృష్టించడం, వాటి ద్వారా దాడులు చేయించడం, నిరాధారమైన ఆరోపణలు చేయడం పోలీసుల పని అని అన్నారు. ఏ సంఘం అయినా, పార్టీ అయినా నాయకుల పేర్లతో ప్రకటనలు ఉండాలి. కానీ ఇటీవల మావోయిస్టు పార్టీపై ఆదివాసీ సంఘాల పేరుతో చేస్తున్న ఆరోపణలు నిరాధారమేనని అన్నారు. మావోయిస్టులపై ఆదివాసీ సంఘాల పేరిట పోలీసులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలను ఆదివాసీ పేరిట పత్రికలకు విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు.

# ఘనంగా కొత్తలపండుగ వేడుకలు

**-అఖిల భారతీయ గోండ్వానా గోండు మహాసభను జయప్రదం చేయండి**

<u>*భద్రాచలం ప్రభాతవార్త :*</u>

భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న దమ్మక్కగుండెం, సమ్మక్కగుండెం, సారలమ్మగుండెంల వద్ద ఆదివాసీలు కొత్తలపండుగను ఆదివారం నిర్వహించారు. ఈ పండుగకు ముఖ్య అతిధిగా అఖిల భారతీయ గోండ్వానా గోండు మహసభ జాతీయ కార్యవర్గ, ఒడిస్సా రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ముందుగా ఏరియా హాస్పిటల్ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా ఆదివాసీ అమర వీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యులు మడివి నెహ్రూ మాట్లాడుతూ సంస్కృతిక, సాంప్రదాయాలే మన ఉనికికి,



మనుగడకు ఆదారమని, భద్రాచలం ఉంటూ ఈ పండుగను జరుపుకోవడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఒడిస్సా రాష్ట్రంలోని ఝూర్సుగూడాలో డిసెంబర్ 15న జరిగే అఖిల భారతీయ గోండ్వానా గోండు మహసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా గోండు మహసభ ఒడిస్సా రాష్ట్ర అధ్యక్షులు డంబరుదర్ నాయక్, అంగుల్ జిల్లా అధ్యక్షులు సదాసిబా నాయక్, బలంగిర్ జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ బాయ్, మల్కాన్‌గిరి జిల్లా అధ్యక్షులు ముకుంద పొడియామి, భార్గడ్ జిల్లా అధ్యక్షుడు భాగిరతి సింగ్, నవరంగ్‌పూర్ జిల్లా సలహాదారుడు సుఖ్దేవ్ గోండ, వాయుర్ బాంజ్ జిల్లా సలహాదారులు తరణి సేన్ నాయక్, ఏఐఏఈఎఫ్ కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మడివి రవీంద్రనాథ్ ఠాగూర్, జీసీసీ డిఎం కుంజా వాణీ తెలంగాణ ఏఎస్‌పీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర, ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా నాయకులు జగ్గా పుల్లయ్య, ఆదివాసీ కోండరెడ్ల సంఘం జిల్లా నాయకులు, జిజిపి భద్రాచలం నియోజకవర్గం ఇంచార్జ్ ఉమ్మల దుర్గారెడ్డి, ఆంధ్ర ఏవిఎస్‌పీ ఏఎస్ఆర్ జిల్లా నాయకులు కుంజా శ్రీను, కొత్తల పండూమ్ నిర్వక ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.








## అనాథలకు చీరలు పంపిణీ

కార్పొరేషన్ ఆగస్టు 28 ప్రభాతవార్త




తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెంట్‌మేరీస్ వైద్యశాలలో ఉన్న అనాథ, అభాగ్య, ఒంటరి మహిళలకు ఉచితముగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లగడపాటి వెంకటేశ్వరరావు హాజరై తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు. సమాజం కోసం, సమాజ శ్రేయస్సు కోసం మేమున్నాము అంటూ మా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మా యొక్క కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మీ అందరి అభిమానాలతో భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లగడపాటి వెంకటేశ్వర్లు, సిద్ధంశెట్టి శ్రీకాంత్, వెల్లంపల్లి వెంకటసుబ్బారావు, సిద్ధంశెట్టి నాగమణి, చేదే జనార్ధన్, కొదుమూరు భద్రయ్య, తామ్రపత్ర గ్రహీత వెంపటి రంగారావు, సబ్బతి ప్రదీప్, కొల్లా రామారావు, వేముల సుధీర్‌బాబు, వాసవి క్లబ్ కేజీఎఫ్ అవార్డు గ్రహీత బూర్లె పుల్లారావు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## రాధాకిషోర్ జన్మదిన వేడుకల్లో నేతలు

రఘునాథపాలెం ఆగస్టు 28 ప్రభాతవార్త



రఘునాథపాలెం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నియోజవర్గ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న నేతలు రాధాకిషోర్ నివాసంలో వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మంచుకొండ సర్పంచ్ వాంకుడోతు విజయ దీపక్‌నాయక్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు హాజరై వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజానాయకుడు, ప్రజాభిమానం పొందుతూ రాబోవురోజుల్లో పార్టీకి అండగా ఉంటూ కార్యకర్తలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాపటపల్లి మాజీ సర్పంచ్ దుంపటి నగేష్, ఖమ్మం అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ కోటేష్‌నాయక్, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు అరవికట్ల ప్రేమ్‌కుమార్, నాయకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, మమత బుచ్చిబాబు, భూక్యా చిన్ననాయక్, రామునాయక్, సుధాకర్‌నాయక్, ఇస్మాయిల్, నరేష్, హుస్సేన్, చల్లా హరీష్, పమ్మిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 28



కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి తన నిజ స్వరూపాన్ని బయటపెడుతూ హక్కులను కాలరాస్తుందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్ నందు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సిపిఎం ఖమ్మం జిల్లా ప్లీనరీ సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో ఎన్నికైన బిజెపి వ్యతిరేక ప్రభుత్వాతను కూల్చే పనిలో నరేంద్రమోడీ నిమగ్నమయ్యారని అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల యొక్క తీర్పులకి వ్యతిరేకంగా నరేంద్రమోడీ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను కూల్చడం మంచి పద్ధతి కాదన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతూ కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేందుకు బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందనానరు. పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతే సంపదంతా వారి వద్దే కేంద్రీకృతమవుతుందన్నారు. దుర్మార్గమైన విధానాలను అనుసరిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలు, పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మంజిల్లా కార్యదరిశ నునాన నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.భారతి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### ఖమ్మం విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రభాతవార్త ఖమ్మం ఆగస్టు 28



ఖమ్మం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు స్థానికంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తూ న్యాయబద్ధంగా రావాల్సిన రాయితీలు ఇవ్వకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నారని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మూడవ పట్టణంలో ఎన్నికలను సీనియర్ సిటిజన్ కార్యాలయంలో గాంధీపార్కులో జిల్లా కార్యదర్శి ఎం.వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఎన్నికల అధికారిగా ఈ.కె.రంగారావు వ్యవహరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కె.కృష్ణమూర్తి, కార్యదర్శి బి.సత్యనారాయణ, కోశాధికారి జి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.దుర్గాదేవి, వై.ఛార్లెస్, అసోసియేట్ అధ్యక్షులు పి.సుదర్శనమ్, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఎ.గణపతిరాజు, ఎస్.సరోజినీదేవి, పబ్లిసిటీ సెక్రటరీ డి.నర్సింహారావు, జిల్లా కౌన్సిలర్ సి.నరసింహారావు, వి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బయ్యతో పాటు సీనియర్ నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కండి

### పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

### మంచుకొండలో ఎన్.ఎస్.ఎస్. శిబిరం

రఘునాథపాలెం ఆగస్టు 28 ప్రభాతవార్త




స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జాతీయ సేవా సమితి ఎన్.ఎస్.ఎస్. శిబిరం ఆదివారం జరిగిన అవగాహనా సదస్సులో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజులపాటు నిర్వహించిన శిబిరం ముగింపు అవగాహన సదస్సులో హాజరైన వక్తలు శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులను ప్రశంసించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించటంతో పాటు స్వచ్ఛభారత్‌లో భాగంగా రహదారుల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి డ్రైనేజీలను శుభ్రపరిచారు. ప్రతిరోజు శిబిరంలో జరిగిన పలు రకాల కార్యక్రమాలను వివరించారు. ఖమ్మం మమత నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో వారంరోజుల పాటు నర్సింగ్ విద్యార్థులు నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. శిబిరం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణ వైష్ణవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజన్‌రాజు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు శివకుమారి, మార్త్య, ఆశాకుమారి, ట్యూటర్లు, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్ మండలం బందుకు రాజకీయ అఖిలపక్షం పిలుపు

బూర్గంపహాడ్ ప్రభాతవార్త :



జేఏసీ బూర్గంపహాడ్ ముండలం ఆధ్వర్యంలో 10వ రోజుకి చేరిన నిరవధిక రిలే నిరహార దీక్షలు. ఆదివారం దీక్షలో పాల్గొన్న వారు జేఏసీ మహిళా నాయకురాలు కుంజా వెంకటరమణ, కేసుపాక సీత, గోవిందమ్మ, ఎస్‌కే.గౌసియా బేగం, రిజ్వానా మొత్తం 28 మంది దీక్షలో పాల్గొన్నారు. తెలంగాణలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో గ్రామాలన్నీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గోదావరి డవరద ముంపుకి అనునిత్యం గురవుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలి లేదా తెలంగాణలో గోదావరి పరివాహక ముంపు గ్రామాలకు మెరుగైన ప్యాకేజ్ 2013 భూసేకరణ చట్టం ప్రకారం సమగ్ర పరిహారం ఇవ్వాలని, ఏకైక నినాదంతో రిలే నిరాఆర దీక్షలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం అనగా 29 ఆగస్టు తేదీన బూర్గంపహాడ్ మండల బందుకు రాజకీయ అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. కాబట్టి మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ ప్రజలు స్వచ్ఛందంగా బందును పాటించి ప్రజల ఆకాంక్షను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో జేఏసీ కమిటీకి సహకరించ వలసిందిగా కోరనైనది. ప్రచార కమిటీలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు కన్వీనర్ కేవీ.రమణ, ప్రధాన కార్యదర్శి దామర శ్రీను, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఖాన్, మండల నాయకులు పులపెల్లి సుధాకర్ రెడ్డి, టిడిపి మండల నాయకులు తాళ్లూరి జగదీష్, భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి ముష్వ వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కమిటీ నాయకులు పేరాల శ్రీను, ముదిగొండ బాలకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, భయ్యా రాము, బిజెపి మండల అధ్యక్షులు చుక్కా బాలాజీ, ఏఐవైఎఫ్ నాయకులు ఎస్‌కే.జహూర్, కెవిపిఎస్ మండల నాయకులు రాయల వెంకటేశ్వర్లు, పోలుకొండ ప్రభాకర్, రాజేశ్వర్ రెడ్డి బందుకు పిలుపునిచ్చారు.




## దాన ధర్మ ట్రస్టు వితరణ

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు28:*



మండలంలోని కమలాపురం గ్రామంలో నిరుపేద కుంటబానికి ఆదివారం దానధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు, కొంత నగదును ట్రస్టు నిర్వాహకులాలు గంట రాధా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనాతో మహిళ మృతి

*పినపాక ప్రభాతవార్త :*

మండలం పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ (28) కరోనా బారిన పడి ఆదివారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గత పది రోజులుగా జలుబుతో బాధపడుతూ తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు కరోనాగా నిర్ధారించారు. మృతురాలు తోగూడెం గ్రామానికి చెందిన ఆర్ఎంపి భార్య. ఈ సందర్భంగా పినపాక వైద్యులు శివకుమార్ స్పందించి మాట్లాడుతూ కరోనా థర్డ్ వేవ్ తీవ్రంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కోవిడ్ వ్యాక్సిన్‌తో పాటు, బూస్టర్ వాక్సినేషన్ చేయించుకోవాలని కోరారు. నేటి నుంచి ప్రతిరోజు గ్రామాల వారీగా వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

## వింతవ్యాధితో బాధపడుతున్న బాలుడికి ఆర్థిక సహాయం

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

ఖమ్మం జిల్లా వైరా మండలంలోని బీసీ కాలనీకు చెందిన ఏనూటి వెంకయ్యబాబు, జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు కేశవ్‌కు వింత వ్యాధి సోకి శరీరంలో అవయవాలు కదలిక లేకపోవడం రోజురోజుకు ఆరోగ్యం క్షీణించడం పట్ల వైద్యచికిత్సలు చేయించేందుకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతున్నాయని తెలుసుకుని ఆ కుటుంబానికి అంత ఆర్థిక స్తోమత లేనందున ది సింబల్ ఆఫ్ యూనిటీ రాయపూడి వ్యవస్థాపక అధ్యక్షులు డా.రాయపూడి రాజేష్(డబ్ల్యూహెచ్‌వో) పిలుపుమేరకు మండల పరిధిలోని రేగుబల్లి గ్రామానికి చెందిన రాయపూడి యేసురత్నం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.9వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాలుడు వైద్యచికిత్సకు ఆ కుటుంబం ఇప్పటి వరకు రూ.25లక్షల మేర వెచ్చించిందని, ఇంకా ఆ బాలుడి ఆరోగ్యం మెరుగుపడనందున దాతలు సహకరించాలని యేసురత్నం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, బాబూరావు, మీసాల ప్రసాద్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



# దళితుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**-మణుగూరు జడ్పీటీసీ**

**పోశం నర్సింహారావు**

*మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు28:*

దళితులు అభ్యున్నతే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. ఆయన ఆదివారం మణుగూరు పట్టణంలోని తెలంగాణ భవన్ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల ఎస్సీ సెల్ విభాగం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అన్ని రకాలుగా దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. దళితులు జీవన ప్రమాణాల్లో మార్పు రావాలనేదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యంబాబు, ప్రధాన కార్యదర్శి రామిడి రామిరెడ్డి ఎస్సీ సెల్ విభాగం నియోజకవర్గ నాయకులు ప్రభుదాసు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగవరపు రమేష్, ప్రధాన కార్యదర్శి కట్టా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కస్తూర్బా హాస్టల్ సమస్యలపై ఆదివాసీ సంఘాల రాస్తారోకో

**-ప్రభుత్వం పనితీరుపై మండిపడ్డ**

**ఆదివాసీ నాయకులు అలెం కోటి**

**-ఆదివాసీ నాయకులను అరెస్ట్**

**చేసిన పోలీసులు**

*పినపాక ప్రభాతవార్త :*

మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి కస్తూర్బా వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అయినా సంబంధిత అధికారులు, ప్రభుత్వం పట్టించుకోండం లేదని తుడం దెబ్బ రాష్ట్ర జిల్లా నాయకులు ఆలెం కోటి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం ఆదివాసీ సంఘం నాయకులు ఐలాపురం వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి మూడు నెలలు అవుతున్న కొత్త టెండర్ల పిలవకపోగా విద్యార్థులు సరైన భోజనం అందించడం లేదు అని, పౌష్టికాహారం అందాక విద్యార్థులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా హాస్టల్‌లోని విద్యార్థులకు వుండటానికి సరైన వసతి ఏర్పాట్లు కూడా ప్రభుత్వం కల్పించలేదని, అవసరమైన సిబ్బందిని నియమించకుండా విద్యార్థులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి కస్తూర్బా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల తరుపున ప్రభుత్వాన్నీ డిమాండ్ చేసారు. సుమారు రెండు గంటలు చేసిన ధర్నాతో వాహనాలు 2 కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఏడూళ్ళ బయ్యారం పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని ఆదివాసీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు నైనారపు నాగేశ్వరరావు, ఆదివాసీ రాష్ట్ర నాయకులు సనప కోటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఎట్టి శ్రీనివాసరావు, జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర, సుతారి నాగేశ్వరరావు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం పినపాక మండలం అధ్యక్షులు కొమరం శ్రీను, ప్రధాన కార్యదర్శి కురుసం సారయ్య, తుడుందెబ్బ సీనియర్ నాయకులు మడకం సత్య లింగం, తుడుందెబ్బ కరకగూడెం మండల అధ్యక్షులు ఊకె గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ శివరామకృష్ణపై దాడిని ఖండించిన సర్పంచ్‌లు ఫోరం రాష్ట్ర కమిటీ

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ వర్సా శివరామకృష్ణపై భద్రాచలంలో దాడి చేసిన సీపీఐకి చెందిన వ్యక్తులు కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఈసం రామ్మూర్తి అధ్యక్షతన ఆదివారం నర్సాపురం గ్రామంలో సర్పంచ్‌ల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దుమ్ముగూడెం మండలం నర్సాపురం సర్పంచ్‌పై సీపీఐ నాయకులు గుండాయిజం చేసి భౌతికదాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి కొరకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తరుణంలో గ్రామపంచాయతీలు అభివృద్ధి పథకంలో ముందుకెళ్తున్నాయని ఇట్టి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో నర్సాపురం సర్పంచ్ శివరామకృష్ణ ముందుండి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని, అది ఓర్వలేని సీపీఐ నాయకులు ప్రజల పట్టు కోల్పోతున్నామనే ఈర్షా భావంతో భౌతికదాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని, ఇట్టి చర్యలను ప్రజలు ఉపేక్షించరని తీవ్రంగా ఈ దాడిని సర్పంచ్‌ల ఫోరం తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా శివరామకృష్ణపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ పార్టీ నాయకులు, పలువురు సర్పంచ్‌లు, దుమ్ముగూడెం మండల రైతు బంధు సమితి అధ్యక్షులు బత్తుల శోభన్‌బాబు, గంగోలు గ్రామపంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తూరు సీతారామారావు, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పూజారి సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

**-వ్యక్తిగత ఘర్షణ పార్టీలకు అంటగట్టడం సరికాదు ... సీపీఐ**

నర్సాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ శివరామకృష్ణపై జరిగిన దాడికి సీపీఐ పార్టీకి సంబంధం లేదని ఆ పార్టీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి రావులపల్లి రవికుమార్ ఖండించారు. భద్రాచలంలో కొంతమంది వ్యక్తులకు సర్పంచ్ శివరామకృష్ణకు జరిగిన వివాదాన్ని సీపీఐ పార్టీకి ఆపాదించడం పద్ధతి కాదని, వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పులమడం సమంజసం కాదని రవికుమార్ ఆరోపించారు.

# సమస్యల పరిష్కారానికి గాయత్రి బ్రాహ్మణుల సేవా సంఘ సమావేశం

*సారపాక, ప్రభాతవార్త :*

బూర్గంపహాడ్ మండలం సారపాక వినాయకుడి గుడి ఆవరణలో గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెల్ది మోహన్‌శర్మ, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం యొక్క కార్యాచరణ, ఇక ముందు జరుగు విషయాల గురించి చర్చించారు. బ్రాహ్మణుల అభ్యుదయా నికి తీసుకో వాల్సి న సమస్యల పరిష్కారాల గురించి అధ్యక్షులు ఇతర సభ్యు లు మాట్లాడారు.



# డీసీసీకి ఎమ్మెల్యే వీరయ్య రాజీనామ చేయాలి : డాక్టర్ ఆర్‌సి నాయక్

## - రాజీనామా చేసే వరకు

## జిల్లా వ్యాప్తంగా నిరసన చేస్తాం



**ఇల్లందురూరల్,ప్రభాతవార్త:**

భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బలమైన ఓటు బ్యాంక్,నిబద్ధత కలిగిన కార్యకర్తలున్న ఉన్న కాంగ్రెస్ పార్టీని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య భ్రష్టు పట్టిస్తున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రామచందర్ నాయక్ ఆరోపించారు.ఈ మేరకు అయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ,మూడేళ్ళుగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉంటు ఒక్కటంటే ఒక్క పార్టీ సమావేశం నిర్వహించ లేదన్నారు.తాను అధ్యక్ష బాధ్యాలు తీసుకున్న తరువాత అంతకు ముందు ఉన్న మండల,నియోజకవర్గ కమిటీలను రద్దు చేసి ఎవరు ఐదు,పదివేలు ఇస్తే వారికి పార్టీ పదవులను కట్టబెట్టారన్నారు. కార్యకర్తలను, నాయకులను ఇష్టానుసారంగ దూషిస్తాడన్నారు. అసలు అయనకు జిల్లా సరిహద్దు ఏంటో తెలియదని,జిల్లాలో ఎన్ని మండలాలు,పట్టణాలు ఉన్నాయో తెలియదని ఆరోపించారు.పార్టీ పరిస్థితిపై ఎప్పుడు చర్చించాలన్న అసలు నాకు ఇష్టం లేకున్నా జిల్లా అధ్యక్షత పదవీని కట్టబెట్టారన్నారు.అగ్రనాయకత్వంగాని,అధిస్టానం గాని ఏలాంటి పార్టీ కార్యాక్రమాలకు పిలుపు నిచ్చిన ఒక్క కార్యక్రమం చేసిన దాకలాలు లేవన్నారు.సాధరణ కార్యకర్త నుంచి అగ్ర నాయకులందరిని తురుచు దూషిస్తు ఉంటాడన్నారు.జిల్లాలో బలమైన ఓటు బ్యాంక్,క్యాడర్ ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్యే వీరయ్య తన పనితీరు,కార్యకర్తల,నాయకులతో వ్యవహరిస్తున్న తీరుతో నిర్వీర్యం చేస్తున్నడన్నారు.ఇన్ని చేస్తు మళ్లీ డీసీసీ పదవిన తనకు కట్టబెట్టాలని ఆధిస్టానం వద్ద మోరపెట్టుకుంటున్నాడన్నారు.ఇప్పటి వరకు మీరు చేసిన సేవలు చాలని తక్షణమే డీసీసీ పదవికీ రాజీనాయ చేయాలని డిమాండ్ చేశారు.అసరమైతే అయన రాజినామ చేసే వరకు జిల్లా వ్యాప్తంగ ఆందోళన నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.ఈ సమావేశంలో గడ్డి శీను,రామస్వామిలు పాల్గొన్నారు.

# నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ శాశ్వత పరిష్కారం చూపాలి

**గార్ల, ఆగష్టు28 ప్రభాతవార్త:**

మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా చేయని సందర్భాలలో గ్రామపంచాయితీ ద్వారా పంచాయితీ ప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ శాశ్వత పరిష్కారం చూపి నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ పట్టణ ప్రజలతో కలిసి డిమాండ్ చేశారు. గతవారం రోజులుగా మంచినీటిని సరఫరా చేయకపోవడంతో పడుతున్న అవస్థలు తట్టుకోలేక ఖాళీబిందేలతో రహదారిపై బైటాయించి మంచినీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజలకు కనీస మంచిని అందించలేని ప్రజాప్రతినిధులు వెంటనే రాజీనామాలు చేయాలని నినాదాలు చేస్తు స్థానిక ప్రజలతో కలిసి గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మిషన్ భగీరధనీటి సరఫరా పైపులైనుల మరమ్మతులు ఏర్పడితే చాలు రోజుల తరబడి నీటి సరఫరా లేక మండల



కేంద్రప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యం నీటితోనే నిత్యజీవితం మొదలవుతుందని, పంచాయితీ పరిధిలో పాఖాలయేటి ఒడ్డున ఫిల్టర్‌బెడ్ ఉందని, రాజీవ్‌టెక్నాలజీ బావి ఉందని, వీధులలో చేతిబోర్లు, పురాతన బావులు నీటి సరఫరాకు అందుబాటులో ఉన్నాయని, అన్ని ఉన్నా అల్లుడినెత్తిన శని అన్నచందంగా నీటి సరఫరా చేయుటకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపకుండా పంచాయతీ మొద్దునిద్రలో తూగుతుందని ఆయన మండిపడ్డారు. మిషన్‌భగీరథ పథకం రాకముందు యేండ్ల తరబడి ఫిల్టర్‌బెడ్ ద్వారా మంచినీరు సరఫరా జరిగేదని, అవికూడ మరమ్మతులతో సక్రమంగా నీటిసరఫరాకు నోచుకోక యేండ్ల తరబడి



ఇబ్బందులు పడేతూనే ఉన్నారని, మిషన్‌భగీరథ పథకంద్వారా అయిన నీటి కష్టాలు పోతాయని ఆశపడ్డ ప్రజలకు నిరాశయే మిగులుతుందని విమర్శించారు. పంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్, 14మంది వార్డుసభ్యులు, ఇద్దరు ఎంపిటిసీలు ఉన్నా ప్రజలు సమస్యలు పరిష్కారం కాక సమస్యలతోనే ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారని, ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు ప్రత్యామ్నాయంగా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు భూక్య హరినాయక్, కందునూరి కవిత, గుండేటి వీరభద్రం, స్థానిక ప్రజలు, తదితరులున్నారు.

# రైతులకు కొత్తరుణాలు మంజూరు చేయాలి

**గార్ల, ఆగష్టు28 ప్రభాతవార్త:**

గతంలో రైతులకు ఇచ్చిన రుణాలు ఒకేదఫాలో మాఫి చేసి కొత్తరుణాలు మంజూరు చేయాలని ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. సెప్టెంబర్6న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దర్నా ప్రదర్శన ను జయప్రదం చేయాలని కోరుతు ప్రచారంలో భాగంగా చిన్నకిష్టాపురం, అంజనాపురం గ్రామంలో చేపట్టిన ప్రచారంలో ఆయన మాట్లాడుతు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వేసిన పంటలను నష్టపోయారని, దేశానికి తిండి గింజలు అందించే రైతు నేడు బ్యాంకు అప్పులు తీర్చలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆర్థికంగా




ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతు, ప్రజాసమస్యల పరిష్కారంలో దృష్టిసారించి ఆదుకోవాలని సూచించారు. రైతులు తీసుకున్న రుణాలను బేషరతుగా మాఫి చేయాలని, రైతు, కౌలురైతులకు ఖరీఫ్ సీజన్ కొత్తరుణాలు ఇవ్వాలని, రైతుభీమా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకాలు రైతులందరికి వర్తింపచేయాలని, అర్హతకలిగిన ప్రతిరైతు, కూలీలకు నూతన పెన్షన్ ఇవ్వాలని, నకిలి విత్తనాలు, పురుగుమందుల విక్రయదారులపై చర్యలు చేపట్టాలని, ప్రజాసమస్యల పరిష్కారం చూపాలని పరిష్కార సాధనలో జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పన, వచ్చేనెల6న రైతులు, కూలీలు భారిసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మంగిలాల్, వాల్కి, కిషన్, సాయి, రాందాస్, వీరన్న, మంగిణి, లక్ష్మీ, తదితరులున్నారు.

# కషాయికరణతో విద్యార్థుల్లో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న కేంద్రం

**నర్సంపేట,ఆగస్టు 27,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం కాషాయికరణతో విద్యార్థుల్లో మతోన్మాధాన్ని ప్రేపిస్తుందని ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జునలు అన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యల అధ్యాయానిక చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర నాలుగో రోజు వరంగల్ జిల్లా నర్సంపే టకు చేరుకుంది. ఈ మోటార్ సైకిల్ యాత్రకు విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు నర్సంపే టలోని అంబేద్కర్ సెంటర్లో ఘనంగా స్వాగతం పలికారు కేంద్రంలో మోడి ప్రభుత్వం మతోన్మాద విధానాలన అవలంభిస్తూ విద్యను కాషాయి కరణచేసేందుకు శత విధాల ప్రయత్నిస్తున్నదని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి బడ్జెట్లో కనీసం 15శాతం కూడా కేటాయించకపోవడంతో పేద మధ్యతరతి విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపివేస్తూ కూలీలుగాకార్మికులుగా మారుతు న్నారని మరో వైపు రాష్ట్రంలో కేసిఆ ప్రభుత్వం కేజీ టూ పీ ఉచిత విద్య హామీని అమలు చేయకుండ ప్రైవేటుకార్పొరేట్ విద్యాసంస్థలకు ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తు న్నారని ఈ క్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో విపరీతమైన ఫీజులు దండుకుంటున్నారని ప్రభుత్వ స్కూల్లో హాస్టల్స్ కళాశాలలు, అనేక సమస్యలతో కొట్టు మిట్టాడు తున్నాయన్నారు, రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ విద్యా రంగా పరిరక్షణ కోసం ఉద్యమా లను చేపట్టేందుకు ప్రణాళిక రూపొంది స్తామని. పేద మధ్య తరగతి విద్యార్థులు రాజకీయాలకు అతీ తంగా ప్రభుత్వ విద్యారంగ రక్షణకుచేపట్టే ఉద్య మా ల్లోభాగస్వామ్యం కావాలని పిలుపుని చ్చారు.




# నూతన మండల కమిటి ఎన్నిక

**గుండాల, ఆగస్టు 28 ప్రభాతవార్త :**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పిడియస్‌యు ) నూతన మండల కమిటిని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా భూక్య సతీష్, కార్యదర్శిగా వట్టం విష్ణులను కమిటి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారమయ్యే విధంగా చూస్తామని అన్నారు. శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలనివారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. భవిష్యత్‌లో ప్రాంతీయ, రాష్ట్ర సమస్యలపై విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలకు ప్రతీ ఒక్కరూ సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోకేశ్, దివ్య, కుంజ వర్దన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పీడీఎస్‌యు నూతన కమిటీ ఎన్నిక




**ఇల్లందురూరల్,ప్రభాతవార్త:**

పీడీఎస్‌యు పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగ ఎన్నుకున్నట్లు అ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాంబ తెలిపారు.ఈ మేరకు అయన ఆదివారం విలేకర్లతో మట్లాడుతూ,రెండు రోజుల క్రితం పట్టణ 22వ పీడీఎస్‌యు మహసభను నిర్వహించినట్లు తెలిపారు.అ సభల ముగింపు సందర్భంగ నూతన కమిటీని ఏకగ్రీవంగ ఎన్నుకున్నట్లు తెలిపారు.పట్టణ పీడీఎస్‌యు నూతన అధ్యక్షురాలిగా నేహ,ఉపాధ్యాక్షుడిగా నిక్కి,ప్రధాన కార్యదర్శిగా కుమార్,సహయ కార్యదర్శిగా ప్రియ,కోశాధికారిగా గణేష్,సభ్యులుగా జ్యోతి,మధు,నవీన్,నందు,ప్రభాకర్‌లు ఎన్నికైయ్యారని తెలిపారు.కమిటీ ఎన్నిక అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రస్తుత విద్యారంగలో నెలకొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారంకై భవిష్యత్తు కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు.

# విద్యుత్ చార్జీల పెంపు నిరసన పోరాట వీరుల త్యాగాల మరువలేనిధి



**ఇల్లందురూరల్,ప్రభాతవార్త:**

22 ఏళ్ళ క్రితం విద్యుత్ చార్జీల పెంపు వై పోరాటం చేస్తు అమరులైన అమరులు స్మరించుకుంటు వారికి సీపీఎం పార్టీ కార్యాలంలో ఆదివారం నివాళిలర్పించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలన కొనసాగించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను పాటిస్తు పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలను పెంచగ వీటిని నిరసిస్తు అప్పుడు పోరాటం చేసిన నాయకులపై కాల్పులు జరిపి వారి ప్రాణాలను పొట్టన పెట్టుకున్న సంఘట ఎప్పటికి మరువలేనిదన్నారు.అ సంఘటనలో సత్తుపల్లికి చెందిన రామకృష్ణ పోలీసు తుటాలకు బలయ్యాడని గుర్తు చేశారు.విజన్ 2020 పేరిట ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను పాటిస్తు రాష్ట ప్రజలను తీవ్ర ఇబ్బందలకు గురిచేశారన్నారు.ఉమ్మడి రాష్టంలో తెలంగాణ నష్టపోతుందని పోరాడి సాధించుకున్న ప్రత్యేక రా ష్ట్రంలో సైతం ప్రజలు తీవ్రగం ఇబ్బంఆ దులు పడుతున్నారన్నారు.ఇష్టానుసారంగ అన్నింటిపై ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలు జీవించలేని పరిస్థితిని తీసుకోని వచ్చార న్నారు. ప్రభుత్వాల తీరును ప్రజలు ఎండ్డగట్టాల్సిన సమయంల అవసన్న మైందన్నారు.ఈ కార్యక్రమంలో తాళ్ళురి కృష్ణ,మహముద్, లక్ష్మన్, శ్రీనివాస్, వీరయ్య,నర్స య్య,యాకుబ్, రామకృష్ణ,రహీమ్,సుగుణా తదితరులు పాల్గొన్నారు.

# రూ. 4 లక్షల కుటుంబ భరోసా అందించాలి

*దమ్మపేట రూరల్, ప్రభాతవార్త*

: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యత్వం ఉన్న ఫోటో గ్రాఫర్లు విధి నిర్వహణలో ప్రమాద వశాత్తు మరణించినట్లైతే వారికి యూనియన్ తరపున 4లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా అందించాలని మండల ఫోటోగ్రాఫర్స్ అధ్యక్షుడు శోభన్‌రావు కోరారు. గతంలో ఈ సహాయం కేవలం 2లక్షలుగా ఉండేదని అన్నారు. ఆదివారం స్థానిక ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు శ్రీనాధరాజు వెంకటపతి రాజు ముఖ్యఅతిధులుగా విచ్చేశారు. ఈసందర్భంగా తోటి ఫోటోగ్రాఫర్ మిత్రునికి రక్తదానం చేసిన మర్రిగూడెం ఫోటోగ్రాఫర్ 5డి కుమార్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం సభ్యులు జిల్లా అధ్యక్షునికి అనేక సమస్యలపై వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వం కలిగిన ఫోటోగ్రాఫర్లు ఒకొక్కరూ



కేవలం 20రూపాయల చొప్పున కలెక్ట్ చేసినా మరణించిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకోవచ్చునన్నారు. సంఘంలో క్రమం తప్పకుండా సభ్యత్వం చెల్లిస్తూ ఎటువంటి బకాయిలు లేనివారికే ఈ కుటుంబభరోసా పథకం అమలవుతుందన్నారు. ప్రభుత్వాలు ఫోటోగ్రాఫర్లను ప్రత్యేకంగా గుర్తించక పోయినప్పటికీ వివిధ సంఘాల ద్వారా ఒకరికుటుంబానికి మరొకరు అండగా నిలవడం ఎంతో మంచి అలోచన అన్నారు. ప్రతి ఆగష్టు 19 అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం నుండి మరలా ఆగష్టు 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘంలో ఉన్న సభ్యుల వివరాలను పరిశీలించి, మరణధృవీకరణ జరిగినపిదప ఆ కుటుంబానికి బరోసా కల్పించడం న్యాయమైన సేవగా గుర్తించారు. క్రొత్తవారిని కూడా సంఘంలో చేర్పించుకోవడానికి స్థానిక ఫోటోగ్రాఫర్లు ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ప్రభాకరరావు, కుంపటి సత్యం, సతీష్, పెంటయ్య, వేణు, హరివిల్లు ల్యాబ్ సత్యనారాయణ, రామకృష్ణ, నాగేష్, శ్రావణ్ కుమార్, సత్యంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనానికి సమ్మె సెగ?

## కోట్ల రూపాయల్లో బకాయిలు చేతులెత్తేస్తున్న నిర్వాహకులు!!

*అశ్వారావుపేట టౌన్, ప్రభాతవార్త:*

ప్రభుత్వాలు సమన్వయంగా అమలు పరుస్తున్న అనేక సంక్షేమ పథకాలలో విద్యాశాఖకు సంబంధించి మద్యాహ్నభోజన పథకం అత్యంత ప్రతిష్మాత్మకమైనది. అలాంటి బృహత్కర పథకం అమలు ఇప్పుడు అప్పుల ఊబిలో చిక్కుకుంది. మద్యాహ్నభోజన బిల్లులు, నిర్వాహకుల వేతనాలు, కోడిగ్రుడ్డు ధర పెంపుదల అనే మూడు అంశాలపై మద్యాహ్నభోజన కార్మికులు అనేక కార్మిక సంఘాలతో సంఘటితమై ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకున్నా వారి గోడు వినేవారే కరువయ్యారు. లాక్‌డౌన్ ఎత్తివేత అనంతరం అనగా సెప్టెంబర్ 2021 నుండి నేటి వరకూ నిర్వహింప బడుతున్న బడుల పని దినాలలో రెండు విద్యా సంవత్సరాలు, రెండు ఆర్థిక సంవత్సరాలు ఉన్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మొదటి త్రైమాసికం పూర్తవుతున్నప్పటికి గత ఏడాది మార్చి వరకూ పూర్తిస్థాయిలో బిల్లులు, వేతనాలు చెల్లించలేని దుస్థితి.. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు, సమ్మె నోటీస్‌లు, రాస్తారోకోలు వంటి నిరసనలు చేపట్టినా అధికారుల్లో మాత్రం పూర్తిస్థాయిలో చలనం రావడం లేదని అందుకై ఇక మద్యాహ్నభోజనాన్ని వండి పెట్టలేమని నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. మరోపక్క పెరిగిన నిత్యావసర ధరలు, మార్కెట్‌లోని కోడిగ్రుడ్డు ధరకు ప్రభుత్వం చెల్లించే ధరలకు నింగికి, నేలకు ఉన్నంత వ్యతా ్యసం ఉంటుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మద్యాహ్నభోజన కార్యక్రమానికి ఇకనుండి సమ్మెసెగ తగలనుంది. మద్యాహ్నభోజన కార్మిక



నిర్వాహకుల వేతనాలు రూ.1000 నుండి రూ.3వేలకు పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయక పోవడంపై ఉవ్వెత్తున మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.150కోట్లు బకాయి ఉందంటే వీరి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్లే తెలుసుకోవచ్చు. లాక్‌డౌన్ ఎత్తివేత అనంతరం ఒకసారి సిఎఫ్ఎంఎస్ విధానం అంటూ మరోకసారి ఐఎఫ్ఎంఎస్ విధానం అంటూ కాలయాపన చేస్తూ గడచిన ఆర్థిక సంవత్సరం ముగింపు అనగా మార్చినాటికి చెల్లించాల్సిన బకాయిలు ఉమ్మడి భద్రాద్రి ఖమ్మం జిల్లాల్లో సుమారు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని అధికారుల అంచనా. అదే విధంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంఇ ఇప్పటి వరకూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎలాంటి నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. ఇటీవల కాలంలో గత ఏడాది బకాయిలకు సంబంధించిన నిధులను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని నిర్వాహకులకు అందజేసేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మద్యాహ్నభోజన కార్మికులు వాపోతున్నారు. ఒకప్రక్క ప్రభుత్వం గ్రీన్ ఛానల్ పథకం ద్వారా మద్యాహ్నభోజన పథక నిధులు తక్షణం చెల్లిస్తామని ప్రకటనలు చేస్తూ మరోపక్క కోట్లరూపాయల బకాయి పడిఉండటం



ప్రభుత్వానికి ఈ పథకం అమలుపై ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్లే చెప్పవచ్చు. నెలవారి బిల్లులకోసం అప్పులు చేసి పుస్తెలు తాకట్టు పెట్టిన సంఘటనలు, అప్పులు చేసి విద్యార్థులకు మేము మద్యాహ్నభోజన వండి పెట్టలేమని నిలిపి వేసిన సంఘటనలు ప్రతీనిత్యం ఏదో ఒకచోట పత్రికా రూపంలో బహిర్గతమౌతుంది. కొన్ని పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులే మద్యాహ్నభోజన కార్మికుల అవతారం ఎత్తి వండిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి విపత్కర పరిస్థితులలో తామిక పాఠశాలల్లో వంటచేయబోమని ప్రభుత్వం బకాయి నిధులు చెల్లించేంతవరకూ మద్యాహ్నబోజన పథకాన్ని నిర్వహించబోమని శనివారం పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో జిల్లా వ్యాప్తంగా తమ గళాన్ని వినిపించారు. ఈ నేపధ్యంలో తాజా పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సిఐటియు ఆధ్వర్యంలో నేటి నుండి దశలవారి సమ్మె సైరన్ మోగించింది. ఇకనైనా అధికారులు మద్యాహ్నభోజన పథక నిర్వహణపై తక్షణ చర్యలు తీసుకొని తక్షణమే బిల్లులు చెల్లించకుంటే మద్యాహ్నభోజన పథకం అనే కార్యక్రమ నిర్వహణ ఇక పాఠశాలల్లో ఉండబోదని దీని పర్యావశానం ప్రభుత్వ విద్యావ్యవస్థపై, ప్రభుత్వంపై పరోక్షంగా పడుతుందని ఉపాధ్యాయ సంఘ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## మట్టి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడుదాం

*అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:*

ఈనెల 31వ తేదీన జరుపుకునే వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతీ ఒక్కరం మట్టివిగ్రహాలను వాడదామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపిపి జల్లిపల్లి శ్రీరామమూర్తి పర్కొన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మనం ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకునే వినాయక చవితి పండుగను మట్టివిగ్రహాలతోనే జరిపి పర్యావరణాన్ని రక్షించాలని అన్నారు. అదే విధంగా, విద్యుత్, పోలీస్, రెవెన్యూ అధికారులకు సహకరించాలని, మండపాల వద్ద భక్తిపాటలే పెట్టాలని కోరారు. నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో కూడా అధికారుల సూచించిన ప్రదేశంలోనే నిమజ్జనాలు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ సమన్వయ సహకారాలతో అధికారులకు సహకరిస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.






## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

*దమ్మపేట రూరల్, ఆగష్టు28 ప్రభాతవార్త :*

వినాయకచవితి ఉత్సవాలకు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగ్గా తీసుకోవాలని స్థానిక పోలీస్ యసై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మీడియా సమావేశంలో ఈ మేరకు వివరాలను అందించారు. వివిద గ్రామాలలో, ప్రధాన కూడళ్ళు వద్ద గణేష్ ఉత్సవాలను నిర్వహించాలనుకునేవారు పోలీసులను సంప్రధించాలన్నారు. ప్రభుత్వంవారు సూచించిన వెబ్‌సైట్లలో వివరాలను పంపించాలని, మైక్ పర్మిషన్, పంచాయితీ పర్మిషన్ వంటి అనేక పర్మిషన్‌లు పొందిన తర్వాతనే ఉత్సవాలకు అనుమతి ఇస్తామని అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. మరిన్ని వివరాలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు.

## శ్రమ దోపిడిక గురౌతున్న పంచాయతీ కార్మికులు



*దమ్మపేట, ఆగష్టు 28 ప్రభాతవార్త:*

గ్రామ పంచాయతీ కార్మికులు శ్రమదోపికి గురౌతూ చాలీ చాలని వేతనాలతో జీవనం ఎల్లబుచ్చుతున్నారని ఎఐటియుసి నాయకులు యార్లగడ్డ భాస్కరరావు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘ సమావేశం దమ్మపేటలో నిర్వహించారు. ఈ సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ శ్రమ దోపికి గురౌతున్న పంచాయతీ కార్మికులను గుర్తించి వారికి రూ.24వేల వేతనం ఇవ్వాలని, ఆరోగ్య భద్ర కల్పించాలని, ప్రతీ కార్మికునికి రూ.10లక్షల ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుల నిరసన కార్యక్రమం మండల, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులను పోరాటాలవైపు మళ్ళిస్తాయని రానున్న 1వ తేదీ నుండి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పందేటి చెన్నారావు, బెజవాడ రాము, రాంబాబు, ప్రభాకర్, నాగేశ్వరావు, సంకుపాక ధర్మ, బసవయ్య, సీతయ్య, మన్మధరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పనిసరి

*అశ్వారావుపేట అర్బన్, ఆగష్టు 28 ప్రభాతవార్త:*



వినాయక చవితి పర్వదిన ఉత్సవాలను పురస్కరించుకొన మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ చల్లా అరుణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు నిర్వహించేవారు ముందుగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, పంచాయతీ నుండి అనుమతి తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసుకుంటున్నామని పోలీస్ వారికి తెలియజేసి కమిటీ అనుమతి పొందాలన్నారు. మైకులు ఏర్పాటు చేసుకోవడానికి పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు. డిజె సౌండ్‌లకు అనుమతిలేదన్నారు. మట్టివిగ్రహాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ మండలపాల వద్ద దేముడు పాటలే పెట్టాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసుకునే క్రమంలో రోడ్లు బ్లాక్‌చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజలు విజయవంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

# రైతుల ఆదాయం, మద్దతు ధరలో మార్పు కావాలి: బొంతు

<u>*వైరా,ఆగస్ట్28,ప్రభాతవార్త:*</u>
కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఎరువుల బ్రాండ్, ఎరువుల దుకాణాల పేరు మార్పు వ్యవసాయం అభివృద్ధికి దోహదం చేయలేదని వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధర, రైతుల ఆదాయంలో మార్పు కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన స్టడీ సర్కిల్‌లో రాంబాబు మాట్లాడుతూ ఒకే దేశం ఒకే బ్రాండ్ భారత యూరియా, భారత డిఏపి పేరుతో ఎరువులు విక్రయం వలన సంక్షోభంలో ఉన్న వ్యవసాయ సాగుదారులకు ఎలాంటి ఉపయోగం లేదని, దీనివలన వివిధ కంపెనీల ఎరువులను



నిరక్ష్యరాస్యత ఉన్న రైతులు గుర్తించడం కష్టమవుతుందని , డీలర్లకు ఎక్కువ కమీషన్లు ఇచ్చే ఎరువులు రైతులకు బలవంతంగా అంటగట్టే అవకాశం ఉందని అన్నారు. ఎరువులు విక్రయ దుకాణాల పేరు ప్రధానమంత్రి ఎరువులు విక్రయ కేంద్రాలుగా నామకరణం చేయడం వలన రైతులకు ఏమి ఉపయోగం అని ప్రశ్నించారు. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల్లో రైతుల ఆదాయంలో మార్పు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని, సన్నచిన్నకారు, కౌలు రైతులకు ఉచిత ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్, పారుపల్లి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొంతు సమత, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మందడపు రామారావు, పారుపల్లి కృష్ణారావు, నారికొండ అమరేందర్, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

# మాదినేని సునీతకు మాతృవియోగం



<u>*వైరా,ఆగస్ట్28,ప్రభాతవార్త:*</u>
వైరా మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత మాతృమూర్తి రమణాదేవి(60) ఆకస్మికంగా మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులకు లయన్స్‌క్లబ్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, జిల్లా ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిల్లా కమ్యూనిటీ సర్వీసెస్ చైర్మన్ నంబూరి మధు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చింతోజు నాగేశ్వరరావు, రాయపూడి వెంకటేష్, కోశాధికారి మిట్టపల్లి నాగేశ్వరరావు, గ్రేట్ విజన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, సెక్రటరీ తోటకూర శ్రీకాంత్, కోశాధికారి కిషన్‌రాయ్, మైక్రో క్యాబినెట్ సభ్యులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూరినత, జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, కౌన్సిలర్ వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, మిట్టపల్లి నాగి, మిట్టపల్లి సత్యంబాబు, కొల్లా రాంబాబు, దొడ్డా జగన్, నూకల ప్రసాదరావు, నూకల వాసు, నూకల అన్నపూర్ణ, రాయపూడి రజని, పుష్పలత, పెనుగొండ ఉపేందర్‌రావు, కాటేపల్లి రామకృష్ణ, షేక్ పాషా, ఆదూని సురేష్, బండారుపల్లి రవీందర్, గజ్జల కృష్ణమూర్తి, కొత్తా వెంకటేశ్వరరావు, పులి కృష్ణార్జున్‌రావు, ఏపూరి రాజారావు, రామకృష్ణ, టీచర్ రంగా సత్యనారాయణ, పుప్పాల అనంతరామయ్య, కట్టా శేఖర్‌బాబు ఉన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వాటర్ బాటిల్‌లు పంపిణీ



<u>*కామేపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త:*</u>
కామేపల్లి మండల పరిధిలోని ఊటవాగు ఆదివాసీ విద్యార్థులకు ఖమ్మం యూత్ అసోసియేషన్ (ఎన్జీవో) ఖమ్మం చైర్మన్ శ్రీదిటి శ్రీతేజల ఆధ్వర్యంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సారథ్యంలో ఆదివారం బ్యాగ్స్, నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్, జమంత్రీ బాక్స్ పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులు విద్యారంగంలో రాణించి ముందుకు సాగాలని కోరారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం యూత్ అసోసియేషన్ సభ్యులు శ్రీదిటి శ్రీకాంత్, అర్జున్‌సింగ్, బట్టు రాహుల్‌నాయక్, గుంటి వంశీ, శ్రీదిటి శ్రీనివాస్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు దుగ్గి క్రిష్ణ, ముక్తి సాంబశివరావు, వజ్జ రామారావు, ఏర్పల శాంతయ్య, దుగ్గి పాపారాణి, ముకేష్, సోమయ్య, ఊటవాగు స్కూల్ టీచర్, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రేపు ఛలో కలెక్టరేట్ ముట్టడి

<u>*కామేపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త :*</u>
ఆహారోత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ ఆదివారం డిమాండ్ చేశారు. జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఛలో కలెక్టరేట్ ముట్టడి




కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల సహాయ కార్యదర్శి ఎన్వి రాకేష్ తెలిపారు. కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామంలో జీఎస్టీకి వ్యతిరేకంగా నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధిక పన్నులు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందని పేర్కొన్నారు. భోగి భద్రయ్య, కల్తీ లక్ష్మీనారాయణ, చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ జ్యూస్ పంపిణీ




<u>*వైరా,ఆగస్ట్28,ప్రభాతవార్త:*</u>
గ్రేట్ విజన్ అధ్యక్షులు లయన్ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ కాంపిటేషన్ ఎగ్జామ్స్‌కు హాజరైన ఎండలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, పోలీస్ వారికి సుమారు 150 మందికి ఓఆర్ఎస్ జ్యూస్, బిస్కెట్స్ అందించారు. ఈ సందర్భంగా జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు మాట్లాడుతూ గ్రేట్ విజన్ క్లబ్ ద్వారా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం సంతోషదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తోటకూర శ్రీకాంత్, ట్రెజరర్ గంగవరపు కిషన్‌రాయ్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన
# కానిస్టేబుల్ పరీక్షలు
### పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఏసిపి రెహమాన్

<u>*వైరా,ఆగస్ట్28,ప్రభాతవార్త:*</u>



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పరీక్షలను ఆదివారం వైరాలో ప్రశాంతంగా ముగిశాయి. వైరాలోని మధు విద్యాలయం, ఠాగూర్ విద్యాలయం, న్యూలిటిల్ ఫ్లవర్స్ పరీక్షా కేంద్రాల్లో సుమారు 971 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వైరా ఏసిపి రెహమాన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా సిఐ తాటిపాముల సురేష్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.




## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

<u>*కారేపల్లి, ఆగష్టు 28,ప్రభాతవార్త*</u>




ఈనెల 31న నిర్వహించే వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని కారేపల్లి రూరల్ సిఐ ఆరీఫ్ ఆలీఖాన్, ఎస్ఐ కుశకుమార్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసే కమిటిలు ఈనెల 30లోపు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వినాయక విగ్రహం వద్ద మైక్ ఉపయోగించుకుంటే రోజుకు రూ. 100 చొప్పున చలానా కట్టి ఏసిపి వైరా ద్వారా మైకు పర్మిషన్ తీసుకోవాలన్నారు. వివాదాస్పద స్థలాల్లో, చర్చిలు, మసీదులు, పాఠశాలల వద్ద విగ్రహాల ప్రతిష్ట చేయరాదన్నారు. ట్రాపిక్‌కు అంతరాయంకాకుండా రహదారి మార్గానికి దూరంగా మండపాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు వినాయక విగ్రహ ప్రతిష్ట కోసం బలవంతంగా వసూళ్ళు చేయరాదని అలా చేసినట్లు అయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు విగ్రహ ప్రతిష్ట అనంతరం మండపం వద్ద 24 గంటలు కమిటికి సంబంధించిన వ్యక్తి తప్పనిసరిగా ఉండే విధంగా ఏర్పాటుచేసుకోవాలన్నారు. మండపం వద్ద అశ్లీల నృత్యాలు, రికార్డింగ్‌డాన్స్‌లు అనుమతించబడవన్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు తీసుకుని విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు వినాయక నిమజ్జనం రోజున కేటాయించిన స్థలాల్లోనే వేడుకలు జరుపుకోవాలన్నారు. అదేవిదంగా బాణాసంచా పేల్చడం, డిజెలు నిషేదించడమైందన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ పోలీసు సిబ్బందికి నిర్వాహక కమిటి సభ్యులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## గురుకులాల్లో భోజన వసతి అధ్వాన్నం
### -మెస్ చార్జిలు పెంచకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం



<u>*కారేపల్లి, ఆగష్టు 28,ప్రభాతవార్త*</u>
గురుకుల కళాశాలలో భోజన వసతి సక్రమంగా లేకపోవడం, విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచకుండా వారి జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటుందని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నామాల ఆజాద్, పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎస్వి రాకేష్‌లు అన్నారు సింగరేణి మండలం గాంధీనగర్‌లో గల గిరిజన విద్యార్థుల గురుకుల కళాశాలను ఆదివారం వారు సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ ఒలకపోస్తుందని దుయ్యబట్టారు. విద్యార్థులకు నేటికి పూర్తిస్తాయిలో పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేయలేకపోయిందన్నారు కనీసం పడుకోవడానికి డార్మేట్స్ కూడా లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. కూరగాయలు, ఇతర కాంట్రాక్టుల పరంగా నిర్వహణ అప్పగించటంతో కాంట్రాక్టర్ జేబులు నింపేదిగా నేడు గురుకులాలు మారాయన్నారు. గురుకుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోగి బద్రయ్య, కల్తీ లక్ష్మీనారాయణ, చల్లా రాజు పాల్గొన్నారు.

# తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

## పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
## 57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
## ఆసరా పెన్షన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే సండ్రకు ఘన సన్మానం

*కల్లూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త*









పేదరికమే గీటురాయిగా అన్ని వర్గాల పేద ప్రజలకు సంక్షేమ పథకాలు కరోనా సంక్షోభంలో కూడా ఆగకుండా నేటి వరకు అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పనిచేస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య కోరారు. మండల పరిధిలో నూతనంగా మంజూరైన ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సండ్ర పంపిణి చేశారు. మండలంలో నూతన కొత్త పెన్షన్లు మంజూరు కాగా ఆదివారం బత్తులపల్లి, కప్పలబంధం, లక్ష్మీపురం, గోకవరం, కొర్లగూడెం, నారాయణపురం, పడమట లోకారం, తూర్పు లోకారం, పుల్లయ్య బంజర్, కిష్టయ్య బంజర్, హనుమాతండా, పాయ్‌పూర్ గ్రామాల్లో ఆసరా పెన్షన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను, వధువుకు స్వంత ఖర్చుతో చీరలను ఆయా గ్రామాల లబ్దిదారుల వద్దకే ఎమ్మెల్యే సండ్ర వెళ్ళి అందజేశారు. ఆసరా పెన్షన్ కార్డులు పంపిణి సందర్భంగా ఆయా గ్రామపంచాయితీల సర్పంచ్‌లు ఎమ్మెల్యే సండ్రకు మేళతాళాలతో పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వయోపరిమితి 57 సంవత్సరాలకు తగ్గించి, ఏడు సంవత్సరాలు ముందుగానే అర్హులకు రూ. 2 వేల పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 29 వేల ఆసరా పెన్షన్లు ఇస్తున్నామని, కొత్తగా 11 వేల ఆసరా పెన్షన్లు మంజూరయ్యాయని 40 వేల ఆసరా పెన్షన్లు, 10 వేల కళ్యాణలక్ష్మి, 60 వేలు రైతుబంధు ఇస్తున్న ప్రభుత్వం అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఆసరా, వితంతు, ఒంటరి మహిళ, గీత, చేనేత కార్మికుల పెన్షన్లు, దివ్యాంగులకు రూ. 3 వేలు, ఆడపిల్ల పుడితే రూ. 13 వేలు, కేసిఆర్ కిట్టు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు భీమా, రైతుబంధు వంటి పథకాలు అమలుచేస్తూ దేశంలోనే ఏకైక ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వమని ఆయన అన్నారు. కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి రూ.10.5 కోట్ల రూపాయలు మంజూరుకి కృషిచేసి త్వరలో నూతన భవనం నిర్మాణ చేయనున్నట్లు ఎమ్మెల్యే సండ్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్డీఓ సూర్యనారాయణ, తహశీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపిఓ వీరాస్వామి, ప్రజాప్రతినిధులు ఎంపీపీ బీరవల్లి రఘు, జట్పీటిసి కట్టా అజయ్‌కుమార్, రైతు సమన్వయ సమితి సభ్యులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని రఘు, మండల పార్టీ అధ్యక్షులు పాలెపు రామారావు, యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, సర్పంచ్‌లు నందిగామ ప్రసాద్, కళ్యాణపు కొండలరావు, తడికమళ్ళ నాగేంద్ర, సామేలు, పెద్దబోయిన కృష్ణవేణి, పెద్దబోయిన ప్రమీలా దుర్గా ప్రసాద్, దరావత్ మోహన్ నాయక్, ఉటుకూరు రమాదేవి, వైస్ సర్పంచ్ వాకదాని శ్రీనివాసరావు, తాళ్ళూరి రమేష్, ఎంపిటిసి సభ్యులు, టీఆర్ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




### శేషమ్మకు ఘనంగా నివాళులు



*తల్లాడ, ఆగష్టు 28, ప్రబాతవార్త*

తల్లాడ మండలం నరసింహారావుపేటలో ఇటీవల మృతి చెందిన శనక్కాయల శేషమ్మ చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు, మండల కమిటి సభ్యులు పూల మాల వేసి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాటా ్లడుతూ శేషమ్మ, వారి కుటుంబసభ్యులు పార్టీ కోసం పనిచేయించడంలో తన వంతు కృషి చేసారని అన్నారు. ఆమె ఆశయమైన పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎర్రజెండా రాజ్యం సాధించటం కోసం కుటుంబసభ్యులు,గ్రామ ప్రజలు పనిచేయటమే శాంతమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహనరావు, కమిటి సభ్యులు గుంటుపల్లి వెంకటయ్య, చల్లా నాగేశ్వరరావు,పులి వెంకటనరసయ్య, సూదా హన్మంతరావు, పేరసాని వెంకటయ్య, శీలంకి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### 35వ రోజుకు చేరిన విఆర్ఎల దీక్షలు



*తల్లాడ, ఆగష్టు 28, ప్రబాతవార్త*

తమ సమస్యలు పరిష్కరించాలంటూ విఆర్ఎలు చేస్తున్న సమ్మె ఆదివారంకు 35వ రోజుకు చేరుకుంది. ఈ రోజు కల్లూరు, వేంసూరు, తల్లాడ మండలాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు అంజద్, బి శ్రీను, ఎం మహేష్, శ్రీను,కోట శ్రీనివాస్, తలారి శ్రీను, మస్తాన్, గంధం నరసింహారావు, షేక్ మొయిద్దీన్, జానీ, వెంకటేశ్వర్లు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోటు పుస్తకాలు, చీరలు పంపిణీ



*తల్లాడ, ఆగష్టు 28, ప్రబాతవార్త*

హైదరాబాద్‌కు చెందిన ఆశ్రీ సర్వీస్ సొసైటీ ఆద్వర్యంలో మండల పరిదిలోని గోపాలపేటగ్రామంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్దులకు నోటు పుస్తకాలు, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆశ్రీ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు పూర్ణి, రామకిషోర్‌రెడ్డి, రాయమ్మ, చీకటి రవి తదితరులు పాల్గొన్నారు.

### బాలపేటలో కరెంటు షాక్‌తో మేకల మృతి

*తల్లాడ, ఆగష్టు 28, ప్రభాతవార్త*



తల్లాడ మండల పరిదిలోని బాలపేట గ్రామంలో ఆదివారం కరెంటు షాక్‌తో ఆరు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాలెపు సత్యనారాయణ మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూ లాగానే ఆదివారం కూడా ఆయన తన మేకలను మేపుకోవటానికి సమీపంలోని సుబాబుల్ తోటలోకి వెళ్లాడు. అక్కడ 11 కెవి విద్యుత్‌వైరు తెగి పడటంతో ఆరు మేకలు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాయి. తనకు జీవనాధారమైన మేకలు మృతి చెందటం పట్ల సత్యనారాయణ ఆవేదన చెందాడు. తనకు లక్షన్నర వరకు నష్టం జరిగిందని అధికారులు స్పందించాలని ఆయన అధికారులను వేడుకుంటున్నారు.

### విద్యారంగంపై కెసిఆర్ సర్కార్ నిర్లక్ష్యం
### మెస్ చార్జీలను తక్షణమే పెంచాలి

*కామేపల్లి, ఆగష్టు 28, ప్రభాతవార్త :*

విద్యారంగంపై కెసిఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ను అవలంభిస్తుందని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నామాల ఆజాద్,పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి రాకేష్ ఆరోపించారు.కామేపల్లి ఆశ్రమ పాఠశాల, కేజీబీవీలను ఆదివారం పీడీఎస్‌యు, పీవైఎల్ ప్రతినిధి బృందం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని తక్షణమే విడనాడాలని, విద్యార్దుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.బంగారు తెలంగాణలో కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యల వలయంలో ఉన్నాయన్నారు.సిఎం కెసిఆర్ తన జీతంపై ఉన్న ప్రేమ విద్యార్థుల మెస్ చార్జీల పెంపుదలపై లేదని అన్నారు.మెస్ చార్జీలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.లేని యెడల ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భోగి భద్రయ్య,కల్తీ లక్ష్మీనారాయణ,చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

### కిష్టారం సర్పంచ్ దంపతులకు సన్మానం



*సత్తుపల్లి, ఆగష్టు 27, ప్రభాతవార్త:*

మండల పరిధిలోని కిష్టారం గ్రామ సర్పంచ్ చెట్టుమాల రేణుకా ఈశ్వర్‌కు ఇటీవల జరిగిన స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నందుకు గాను గ్రామ పెద్దలు ఉడతనేని అప్పారావు దంపతులు అభినందిస్తూ ఆదివారం సర్పంచ్ రేణుకా ఈశ్వర్ దంపతులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పదంలో నడిపిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిందుకు మీకు మరియు మీ పాలక వర్గానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఉడతనేని సత్యం హయంలో కట్టించిన సొసైటీ భవనం, హెల్త్ సెంటర్, సొసైటీ భవనం ఇప్పుడే పునర్‌నిర్మాణించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజులలో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామానికి ఇంకా మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సర్పంచ్ రేణుకా ఈశ్వర్ దంపతులను ఆశీర్వదించారు.

# మునుగోడులో ఇంటింటికి వీఆర్ఏల కార్యక్రమం చేపడతాం

## వీఆర్ఏల సమ్మెకు మద్దతు తెలిపిన దయాకర్, బెల్లయ్యనాయక్‌లు



కూసుమంచి ఆగస్టు 28 (ప్రభాతవార్త)

కూసుమంచిలో వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక సమ్మె 35వ రోజు కొనసాగింది. ఆదివారం టిపిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, బెల్లయ్యనాయక్‌లు వీఆర్ఏల సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వీఆర్ఏల సమ్మె శిబిరాలే దర్శనమిస్తున్నాయని, 35 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23వేల మంది ఉద్యోగులు సమ్మెలో ఉంటే ముఖ్యమంత్రి మాత్రం మునుగోడు రాజకీయాలపై దృష్టి పెట్టారన్నారు. రాష్ట్ర సమస్యలు పట్టని ముఖ్యమంత్రికి మునుగోడు ప్రజలు ఓటుతో సమాధానం ఇస్తారని అన్నారు. ఫామ్‌హౌస్ ముఖ్యమంత్రికి ఎలక్షన్ వస్తే హడావిడి చేయడం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి ఆయన కుమారునికి రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలు పట్టవని, ఇలాంటి చేతగాని అసమర్ధులను వచ్చే ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని సూచించారు. వీఆర్ఏలు మునుగోడులో ప్రతి ఇంటికి తిరిగి ముఖ్యమంత్రి మీకు చేస్తున్న అన్యాయాన్ని మునుగోడు ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంఆ విఆర్ఏలు సమ్మెకు సంఘీభావం తెలిపిన అద్దంకి దయాకర్, బెల్లయ్యనాయక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. మీ సూచన ప్రకారం మా సమస్యలు పరిష్కారం కాని ఎడల ఖచ్చితంగా మునుగోడులో ఇంటింటికి వీఆర్ఏల కార్యక్రమాన్ని రాష్ట్ర వీఆర్ఏ జేఏసీ నిర్ణయం ప్రకారం చేస్తామని అవసరమైతే 1000 మంది వీఆర్ఏలను మునుగోడు ఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దారా శ్రీను, అన్వర్, ఉపాధ్యక్షులు గుడ్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కాంతారావు, ఉపేందర్, మోహన్, రంగమ్మ, మాధవి, సైదా, బహుజన నాయకుడు కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విఆర్ఏల సమ్మెకు మద్దతు తెలిపిన గ్రామదీపికలు

కూసుమంచి ఆగస్టు 28 (ప్రభాతవార్త)

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు పేస్కేల్ జీవోను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని, 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏలకు వారి స్థానంలో వారసులకు ఉద్యోగం కల్పించాలని, అర్హత కలిగిన విఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలని వీఆర్ఏలు చేస్తున్న సమ్మె 35వ రోజు కొనసాగింది. 35వ రోజు మండలంలోని గ్రామదీపికలు సమ్మె శిబిరం వద్దకు వచ్చి వారి సంఘీభావాన్ని తెలియజేశారు. గ్రామదీపికల మండల అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ నిరుత్సాహపడకుండా మీ హామీలన్నీ నెరవేరేవరకు సమ్మెను విరమించవద్దని ప్రభుత్వం మీ హామీలను నెరవేరుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

... ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం..
--బొడ్డు నరేందర్ వీఆర్ఏ--



మండల వీఆర్ఏ బొడ్డు నరేందర్ మాట్లాడుతూ వీఆర్ఏలు అందరూ కూడా పేద వర్గానికి చెందినవారే ఉన్నారని, మా బతుకు పోరాటంలో చేస్తున్న ఈ సమ్మెను గుర్తించి మా కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 35 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 23వేల మంది ఉద్యోగులు సమ్మెలో ఉంటే ఈ ముఖ్యమంత్రికి కనిపించటంలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం కనీసం మావైపు చూడటం లేదని వాపోయారు. మేము చేస్తున్న ఈ సమ్మె విలాసవంతంగా జీవించటం కోసం కాదని, ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఆత్మాభిమానం చంపుకొని వెట్టిచాకిరీ చేసి చేసి అలసిపోయి భరించలేక మా హక్కులను సాధించుకోవడం కోసం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల కోసం వాటిని నెరవేర్చుకోవడం కోసం చేస్తున్నామన్నారు. కావున సీఎం దయార్ధ హృదయంతో వెంటనే స్పందించి మా సమస్యలపై చర్చించి మా హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల మండల అధ్యక్ష, కార్యదర్శులు దారా శ్రీనివాసరావు, షేక్ అన్వర్, గుడ్ల రమేష్, చిమట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దళిత బహుజన ఆత్మగౌరవ సభ

కూసుమంచి ఆగస్టు 28 (ప్రభాతవార్త)

మండల కేంద్రంలో ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు బహున నాయకుడు కొమ్ము ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన దళిత, బహుజన ఆత్మగౌరవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లయ్య నాయక్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి దయాకర్‌లు పాల్గొన్నారు. మాట్లాడుతూ దళిత బహుజనులందరు కుల మతాలకు అతీతంగా ఎదగాలని, అణగారిన వర్గాలు ఇప్పటికి కడుపు నిండా తినడానికి ఇబ్బందులు పడుతున్నారని, దళిత బహుజనుల



పితామహుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చెప్పినట్లు జ్ఞానం ద్వారానే ఏదైనా సాధ్యం అవుతుందని అందుకనే దళిత బహుజనులు బాగా చదువుకొని గొప్పవారిగా అభివృద్ధి చెందాలని అన్నారు. దళిత బహుజనుల బ్రతుకుల్లో వెలుగులు రావాలంటే దళితబహుజనులు అందరూ ఏకమై రాజ్యాధికారం వైపు పయనించాలని సూచించారు. అనంతరం కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ ఏదైనా ఉద్యమం ఒక్కడితో మొదలై లక్షలాదిమందితో విజయఢంకా మోగిస్తుందని, ఆదివారం జరిగిన దళిత బహుజనుల ఆత్మగౌరవ సభ రానున్న రోజుల్లో 32 జిల్లాల్లో దళిత బహుజనులను ఏకం చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు అర్వపల్లి వెంకటేశ్వర్లు, పల్లెపొంగు ఉపేందర్, మల్లిశెట్టి నాగేశ్వరరావు, దాసరి ఉపేందర్, నెల్లూరి పుల్లయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నార

# జ్వరాల బారిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్

**జ్వరం బారినపడ్డ 100 మంది విద్యార్థులు**

**70 మంది విద్యార్థులను ఇంటికి పంపిన హాస్టల్ సిబ్బంది**

కూసుమంచి ఆగస్టు 28 (ప్రభాతవార్త)

మండల కేంద్రంలో కూసుమంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పక్కనే ఉనన బాయ్స్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నివసిస్తున్నారు. కాగా హాస్టల్‌లో ఒక్కసారిగా



వైరల్ జ్వరాల కలకలంతో విద్యార్థులు అవస్థకు గురయ్యారు. హాస్టల్ మొత్తం 434 మంది విద్యార్థులు ఉండగా అందులో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు వైరల్ జ్వరాలకు గురయ్యారు. కాగా హాస్టల్ సిబ్బంది సుమారు 70 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారిని ఇంద్దకు పంపించివేశారు. కాగా సుమారు 30 మంది విద్యార్థులకు ఆదివారం హెల్త్ క్యాంపు నిర్వహించి ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది మందులు అందజేశారు. మండల కేంద్రంలో ఉన్న హాస్టల్‌లో అసలు అంతమందికి జ్వరాలు రావడం హాస్టల్‌లో పరిశుభ్రత లోపమా, లేక సీజనల్ జ్వరాల అన్న విషయాన్ని అధికారులు తెలియజేయాల్సి ఉంది. విద్యార్థులు అంతమందికి జ్వరం రావడమంటే అధికారుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## గణేష్ మండపాలకు విద్యుత్ కలెక్షన్‌కు అనుమతి తప్పనిసరి

ముదిగొండ,ఆగస్టు 28, (ప్రభాతవార్త) :

మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, నిర్వహకులు విద్యుత్ శాఖ వారు మండపాలకు అవసరమైన విద్యుత్ కోసం విద్యుత్ శాఖ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అసిస్టెంట్ ఇంజనీర్ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా విద్యుత్ లైన్లకు వైర్ తగిలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. మండపాలకు అవసరమైన విద్యుత్ ఉపయోగం కోసం ముందుగా అనుమతి తీసుకుంటే విద్యుత్ సిబ్బంది కనెక్షన్ ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ అనుమతి కొరకు 1కెడబ్ల్యు లోడ్ వరకు రూ. 1560లు, 1కెడబ్ల్యు నుండి 1.5కెడబ్ల్యు వరకు రూ. 2300లు, 1.5కెడబ్ల్యు నుండి 2కెడబ్ల్యు వరకు రూ. 3020లు, 2కెడబ్ల్యు తర్వాత రూ. 3020+ప్రతి కెడబ్ల్యుకి రూ. 1560లు చొప్పున ఖర్చు అవుతుందని తెలిపారు.

## గ్రానైట్ కార్మికుడు మృతి

ముదిగొండ, ఆగస్టు 28, (ప్రభాతవార్త) :

మండల పరిధిలోని గ్రానైట్ పని నిమిత్తం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వలస కార్మికుడు ప్రమాదవశాత్తు డాబాపై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన ముదిగొండలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై తన సహచరులు ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగొండ ఎస్సై తెలిపారు.

## పాలేరు నియోజకవర్గ పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక



కూసుమంచి ఆగస్టు 28 (ప్రభాతవార్త)

ఖమ్మం జిల్లా పద్మశాలీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్న సందర్భంగా పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా కూసుమంచి గ్రామ సర్పంచ్ చెన్నమోహన్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మ ఉపేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికయిన వారిని ఈ సందర్భంగా జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఆయన అభినందించారు.

## పరీక్షా కేంద్రాలను

# పరిశీలించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మంక్రైం ఆగస్టు 28 ప్రభాతవార్త**

జిల్లాలో కొన సాగుతున్న కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందో బస్తును పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ . వారియర్ పరిశీలించారు. ఖమ్మ ం, సత్తు పల్లి ప్రాంతా లలో 105 పరీక్షా కే ంద్రాల వద్ద అమ లవు తున్న 144 సెక్షన్ పరిశీలించేందుకు ఆదివారం నగరం లోని శాంతి నగర్ కాలేజ్, ఎస్‌బి ఐటి కాలే జ్, బాలి కల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రా లను సందర్శి ంచి బందోబస్తు ఏర్పా ట్లను పరిశీలించి తగిన సూచ నలు చేశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్న నేపథ్యంలో పోలీస్ అధి కారులు అప్ర మత్తంగా ఉండా ల ని ఆదేశించారు.








## ఆసరా పెన్షన్‌తో నిరుపేదలకు ఆర్థిక భరోసా

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు28:**

ఆసరా పెన్షన్‌తో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని, ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు జిల్లాలో 28,427 మందికి కొత్తగా పెన్షన్లు మం జూరు చేసి నట్లు ప్రభుత్వ విప్, పిన పాక ఎమ్మె ల్యే, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు తెలిపారు. ఆయన ఆదివా రం ప్రత్యే కంగా ప్రభాతవార్తతో మాట్లాడారు. ఈ నెల 30 వతారీఖున రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కొత్తగా ఆసరా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, ఐడీ కార్డులు అందజేస్తా రన్నారు. జిల్లా కేంద్రంలో పంపిణీ అనంతరం మండల కేంద్రాలలో గ్రామాలలో పంపిణీ చేస్తారన్నారు. ఇచ్చిన మాట, చేసిన వాగ్దానాలను నెరవేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అందరి ఆశీస్సులతో సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమంలో ముందు వరసలో నిలపారన్నారు. నిరుపేదలైన అభాగ్యులకు ఆసరా పెన్షన్‌తో ఆదుకుటుందని వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు 57 సంవత్సరాలు నిండిన వారందికీ ఆసరా పెన్షన్లు మంజూరు వచ్చాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 57 ఏళ్లకే అందించి కొత్త పెన్షన్లు మొదలుపెట్టడం నూతనంగా మంజూరైన ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం తరుపున ప్రత్యేక శుభాకాంక్షలు, అదేవిధంగా జిల్లా ప్రజల తరుపున సీఎం కేసీఆర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రశాంతంగా ముగిసిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష

**కొత్తగూడెం క్రైం, ఆగస్టు 28 - ప్రభాతవార్త:**

జిల్లా పరిధిలో పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జిల్లా పరిధిలో కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలంలో ఏర్పాటు చేసిన 49 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఒక గంట ముందుగానే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. జిల్లా పరిధిలో 17,077 మందికి హాల్ టిక్కెట్లు జారీ చేయగా 15,633 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో కొత్తగూడెం రీజియన్‌లో 13,160 మంది, భద్రాచలంలో 2473 మంది అభ్యర్థులు ఉన్నారు., ఈ పరీక్షలకు



నోడల్ అధికారిగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి.శ్రీనివాసరావు వ్యవహరించారు.

**- పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష కేంద్రాలను సందర్శించారు. రాత పరీక్ష జరుగుతున్న పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడంతో రాత పరీక్ష ప్రక్రియను కూడా గమనించారు.

---

## అది సిమెంట్ గోదాము కాదు...

# ప్రభుత్వ కార్యాలయమే..!

- **అధికారులను దద్దమ్మలు చేసి ఎంచక్కా వ్యాపారం**
- **భక్తుడి ముసుగులో ప్రభుత్వ ఖజానాకు గండి**
- **చోద్యం చూస్తోన్న అధికార యంత్రాంగం**

**చంద్రుగొండ, ఆగస్టు 28 - ప్రభాతవార్త:**

చుట్టూర ప్రభుత్వ కార్యాలయాలు... మధ్యలో సిమెంట్ గోదాము... దానిని చూస్తే ప్రభుత్వ గోదాము అనుకునేలా కార్యకలాపాలు జరుగుతుంటాయి... అసలేమీ జరుగుతుందోనని అడిగే అధికారి లేక వారినే దద్దమ్మలు చేసి పబ్బం గడుపుకోవడం ఇతని లౌక్యానికి నిదర్శనం... మరీ ఆయన ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదు... కేవలం ఒక సాయిబాబా భక్తుడు... పొద్దున్న లేస్తే సూక్తులు చెప్తూ అందరిలో మహోన్నత వ్యక్తిగా ముద్ర వేసుకున్నాడు. కానీ చిక్కు వచ్చిందల్లా ఒక్కటే... అదేనండి భక్తి ముసుగులో... ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే వక్ర బుద్ధి దాగుందని తెలుస్తోంది.

వివరాల్లోకి వెళ్లే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఓ కార్యాలయం శిధిలావస్థలో ఉంది. ఆ కార్యాలయం ద్వారా తన వ్యాపారాన్ని మూడు పూలు ఆరు కాయలుగా సాగిస్తున్నాడు ఆ సిమెంట్ వ్యాపారి (సాయిబాబా భక్తుడు). తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతనంగా చేపట్టిన ఫారెస్టు కార్యాలయం కాంట్రాక్టర్‌కు సిమెంట్ సరఫరా చేసిన సదరు వ్యాపారి అక్కడే ఉన్న ప్రభుత్వ కార్యాలయాన్ని సిమెంట్ గోడౌన్‌గా మార్చుకునేందుకు ఎవరితో మాట్లాడినాడో తెలియాదు కానీ దాదాపు రెండు మూడు లారీల సిమెంట్ పట్టే సామర్థ్యం గల కార్యాలయంలో సిమెంట్ కట్టలను దించి సిమెంట్ గోడౌన్‌గా మార్చి గత కొన్ని నెలలుగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. లారీలకు లారీలు సిమెంట్ దిగుమతి చేసుకొని గ్రామాల్లో ఉన్న వారికి అమ్ముతూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇదే కాక ఇతగాడు మండలంలో సబ్ కాంట్రాక్టర్ అవతారమెత్తి కాంట్రాక్టర్ల పేర్ల మీద ప్రభుత్వ కట్టడాలు కట్టిస్తూ ఆ కాంట్రాక్టర్ల పేర్ల మీద రాయితీతో వస్తున్న సిమెంట్ సైతం బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు రెండు మూడు లారీల సిమెంట్ పట్టే అంత సామర్థ్యం కలిగిన రూం కావాలంటే చంద్రుగొండ స్థానిక ప్రధాన సెంటర్లలో 20 నుంచి 25 వేలకు పైగా కిరాయి ఉంటుంది. అలాంటిది ఆ వ్యాపారి ఎలాంటి కిరాయి లేకుండానే గత కొన్ని నెలల నుంచి తన వ్యాపారాన్ని అందరి అధికారుల కళ్లు గప్పి తన వ్యాపారాన్ని చేస్తున్నాడు ఇతగాడు నేను సత్యసాయి బాబా భక్తుడిని అందరికీ సాయం చేస్తా అని నీతి మాటలు చెప్పేవాడు. అలంటి సాయిబాబా భక్తుడు నీతి తప్పి ప్రభుత్వం భవనాన్ని వాడుకోవడం చూస్తే పైకే సాయిబాబా భక్తుడు లోన మాత్రం ప్రభుత్వ అధికారులు మోసం చేసి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసే దొంగ భక్తుడిగా వార్తల్లోకి ఎక్కినాడు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు స్పందించి ఎన్ని నెలలుగా ఈ ప్రభుత్వ కార్యాలయాన్ని వాడుకున్నాడో అన్ని నెలలకు ప్రభుత్వానికి జరిమానా కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటూ పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేపట్టి దర్శనమిస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే ఖాళీగా ఉన్న కార్యాలయాన్ని సిమెంట్ గోడంగా మార్చి వాడుకోవడంపై మండల అధికారుల పనితీరుపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చరేస్తున్నారు. ఆయన వెనకట ఎవడో సాత్రం చెప్పినట్లుగా పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎక్కిరించినట్లుగా ఏకంగా ప్రభుత్వ అధికారుల కళ్లముందే ఉన్న ప్రభుత్వ కార్యాలయాన్ని గోడౌన్‌గా మార్చి అందరి అధికారులను దద్దమ్మలను చేసిన సాయిబాబా భక్తుడిపై అలానే ప్రభుత్వ ఆస్తులను అధికారుల కళ్లముందే ప్రైవేట్ వ్యక్తులు వాడుకోవడం, వారికి సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో ప్రజలు వేచి చూడాలి మరి.



**- వ్యాపారి, అధికారులపై చర్యలు తీసుకోవాలి: వరికూటి వెంకటరావు, జిల్లా ఎన్డీ నాయకుడు**



స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రభ్వు కార్యాలయాల్లో చంద్రుగొండకు చెందిన ఓ సిమెంట్ వ్యాపారి ఆ కార్యాలయాన్ని గత కొన్ని నెలలుగా సిమెంట్ నిల్వ చేసి వాడుకుంటున్నట్లు తెలుస్తుంది. వారికి సహకరించిన అధికారులు ఎవరు వారిని గుర్తించాలి. అసలు కొన్ని నెలలుగా ఇంతమంది అధికారులు ఉన్న కార్యాలయంలో ఖాళీగా ఉన్న కార్యాలయంలో సిమెంట్ వ్యాపారం జరుగుతున్న చూడకపోవడంపై అనుమానం వస్తుంది. తెలిసే ఈ తతంగం అంతా జరుగుతుందన్నారు. ఇలాంటి అధికారులు ఉండబట్టే ఈ కార్యాలయానికి చుట్టూ పక్కల ఉన్న ప్రభుత్వ స్థలం అంతా ఆక్రమణకు గురైంది. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో ఖాళీగా ఉన్న కార్యాలయం బయట వ్యక్తులు వాడుకోవడం చేస్తే రాబోయే రోజుల్లో ఈ కార్యాలయం మధ్యలో ఇల్లు కట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటూ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాన్ని వాడుకుంటున్న వ్యాపారిపై, అతనికి సహకరిస్తున్న అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.